జైత్ర
మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్

PRGI NO: APTEL/26/A7657

జ్యోతి
# శ్వేత
JYYOTHI SHWETHA
దినపత్రిక

విజయవాడ, హైదరాబాద్ ॥ సంపుటి:1 ॥ సంచిక: 15 ॥ మంగళవారం ॥ 29-9-2026 ॥ పేజీలు: 8 ॥ వెల 3/-



29 సెప్టెంబర్ 2026 - మంగళవారం శ్రీ పరాభవ నామ సంవత్సరం దక్షిణాయనం - వర్ష ఋతువు భాద్రపద మాసం - కృష్ణపక్షం సూర్యోదయం - ఉ. 6:09 సూర్యాస్తమయం - సా. 6:03 తిథి తదియ సా. 5:08 వరకు తరువాత చవితి సంస్కృత వారం భౌమ వాసరః నక్షత్రం అశ్విని ఉ. 9:02 వరకు తరువాత భరణి యోగం హర్షణ తె. 3:150 వరకు కరణం వనిజ ఉ. 6:14 వరకు విష్టి సా. 5:08 వరకు వర్జ్యం తె. 5:15 నుండి ఉ. 6:46 వరకు దుర్ముహూర్తం ఉ. 8:32 నుండి ఉ. 9:20 వరకు రా. 10:53 నుండి రా. 11:42 వరకు రాహుకాలం మ. 3:04 నుండి సా. 4:34 వరకు యమగండం ఉ. 9:08 నుండి ఉ. 10:37 వరకు గుళికాకాలం మ. 12:06 నుండి మ. 1:35 వరకు బ్రహ్మముహూర్తం తె. 4:33 నుండి తె. 5:21 వరకు అమృత ఘడియలు తె. 3:05 నుండి తె. 4:35 వరకు అభిజిత్ ముహూర్తం ఉ. 11:42 నుండి మ. 12:30 వరకు గమనిక: "ం" అనగా మరుసటి రోజున



## అంధుల క్రికెట్‌కు ప్రభుత్వ అండ

### అజయ్ కుమార్ రెడ్డితో లోకేశ్ భేటీ

**అమరావతి, సెప్టెంబర్ 28 :** ఆంధ్రప్రదేశ్‌లో అంధుల క్రికెట్ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం పూర్తిస్థాయిలో అండగా నిలుస్తుందని రాష్ట్ర ఐటీ, విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ స్పష్టం చేశారు. భారత అంధుల క్రికెట్ జట్టుకు మూడు ప్రపంచకప్ విజయాలను అందించిన మాజీ కెప్టెన్, అర్జున అవార్డు గ్రహీత అజయ్ కుమార్ రెడ్డి సోమవారం మంత్రి లోకేశ్‌ను కలుసుకుని రాష్ట్రంలో అంధుల క్రికెట్ అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా అంధుల క్రికెట్ ప్రస్తుతం ఎదుర్కొంటున్న సవాళ్లు, క్రీడాకారులకు (మిగతా 2వ పేజీలో)



# మంగళగిరి అభివృద్ధికి లోకేశ్ హామీ

## 372 మందికి ఇంటి పట్టాల పంపిణీ

## ప్రతి ఇంటికి తాగునీటి లక్ష్యం

మంగళగిరి నియోజకవర్గంలోని కుంచనపల్లిలో గల శ్రీ శ్రీనివాస కన్వెన్షన్‌లో సోమవారం నిర్వహించిన 'మన ఇల్లు - మన లోకేశ్' మూడో విడత ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమంలో రాష్ట్ర విద్య, సమాచార సాంకేతిక శాఖ మంత్రి నారా లోకేశ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా 372 మంది లబ్ధిదారులకు శాశ్వత ఇంటి పట్టాలు, ప్రధానమంత్రి ఆవాస్ యోజన మంజూరు పత్రాలను అందజేశారు. సొంతింటి కలను సాకారం చేయడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మంగళగిరి నియోజకవర్గ అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. పేద కుటుంబాలకు గృహ హక్కు కల్పించడం ద్వారా వారి జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని తెలిపారు. ఇంటి పట్టాల పంపిణీతో పాటు గృహ నిర్మాణానికి అవసరమైన సహాయ సహకారాలను కూడా ప్రభుత్వం అందిస్తోందని పేర్కొన్నారు.

**మంగళగిరి, సెప్టెంబర్ 28 :** మంగళగిరిలో మౌలిక సదుపాయాల అభివృద్ధిపై ప్రత్యేక కార్యాచరణ రూపొందించామని మంత్రి వెల్లడించారు. 2029 ఎన్నికల నాటికి ప్రతి ఇంటికి తాగునీటి కనెక్షన్, భూగర్భ గ్యాస్ కనెక్షన్, భూగర్భ మురుగు పారుదల వ్యవస్థను పూర్తిస్థాయిలో (మిగతా 2వ పేజీలో)

## ఏనుగుల బెడదపై అప్రమత్తం

### అడవిలోకి మళ్లించేందుకు ప్రత్యేక చర్యలు

### కుంకీ ఏనుగులను రంగంలోకి దించాలని ఆదేశం

### ప్రజల భద్రతకు అత్యధిక ప్రాధాన్యత

### నష్టపోయిన రైతులకు పరిహారం

### సూచన: ఉప ముఖ్యమంత్రి



చిత్తూరు, సెప్టెంబర్ 28: చిత్తూరు జిల్లాలోని పలు గ్రామాల్లో సంచరిస్తూ ప్రజలు, రైతుల్లో భయాందోళనలు కలిగిస్తున్న ఏనుగుల గుంపును వెంటనే సురక్షితంగా అడవిలోకి మళ్లించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని ఉప ముఖ్యమంత్రి, అటవీ పర్యావరణ శాఖ మంత్రి పవన్ కల్యాణ్ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు (మిగతా 2వ పేజీలో)



## అగ్నిమాపక సేవలు మరింత బలోపేతం

### హోంమంత్రి అనిత

**విజయనగరం, సెప్టెంబర్ 28 :** రాష్ట్రంలో అగ్నిమాపక, విపత్తు స్పందన సేవలను మరింత బలోపేతం చేయడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని హోంమంత్రి అనిత తెలిపారు. విజయనగరం జిల్లాలో నూతనంగా ఏర్పాటు చేసిన అగ్నిమాపక కేంద్రాలను ప్రారంభించిన సందర్భంగా ఆమె మాట్లాడారు. పూసపాటిరేగ, బొబ్బిలి అగ్నిమాపక కేంద్రాలను ప్రత్యక్షంగా ప్రారంభించగా, సోంపేట, పాలకొండ కేంద్రాలను వర్చువల్ విధానంలో ప్రారంభించినట్లు వెల్లడించారు. (మిగతా 2వ పేజీలో)



## వాయుగుండం దెబ్బకు రోడ్ల నష్టం

### 2405 కిలోమీటర్ల మేర దెబ్బతిన్న రహదారులు

### పునరుద్ధరణకు రూ. 1,498.30 కోట్ల అంచనా

### ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు

### మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి

**అమరావతి, సెప్టెంబర్ 28 :** తీవ్ర వాయుగుండం ప్రభావంతో రాష్ట్రవ్యాప్తంగా కురిసిన భారీ వర్షాల కారణంగా దెబ్బతిన్న రహదారులన్నింటినీ త్వరలోనే పునరుద్ధరిస్తామని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి తెలిపారు. భారీ వర్షాల సమయంలో ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా ప్రభుత్వం అన్ని రకాల ముందస్తు, సహాయక చర్యలు చేపట్టిందని పేర్కొన్నారు. వర్షాల ప్రభావంతో రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో రహదారులు తీవ్రంగా దెబ్బతిన్నాయని మంత్రి వెల్లడించారు. ఆర్ అండ్ బీ (మిగతా 2వ పేజీలో)



## వరద ప్రభావిత వరి పంటల రక్షణే ప్రధాన లక్ష్యం

### ముంపు ప్రాంతాల్లో శాస్త్రవేత్తలతో కలిసి క్షేత్రస్థాయి పరిశీలన

### పంట పునరుద్ధరణపై అధికారులకు మంత్రి అచ్చెన్నాయుడు స్పష్టమైన ఆదేశాలు

### రైతులు శాస్త్రీయ సూచనలు మాత్రమే పాటించాలని విజ్ఞప్తి

**నిమ్మాడ, సెప్టెంబర్ 28 :** ఇటీవల జిల్లాలో కురిసిన భారీ వర్షాలు, వరదల వల్ల దెబ్బతిన్న వరి పంటలను కాపాడుకోవడమే ప్రస్తుతం ప్రభుత్వ ముందున్న ప్రధాన లక్ష్యమని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు (మిగతా 2వ పేజీలో)



## విద్యార్థుల భవిష్యత్తుకు ప్రభుత్వం అండ

### తేజ డీవీఆర్ కళాశాలలో ఫ్రెషర్స్ వేడుక

### విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపిన సౌమ్య

### విద్యతో పాటు నైపుణ్యాలపై దృష్టి

**నందిగామ, సెప్టెంబర్ 28 :** నందిగామ పట్టణంలోని మధిర ఆర్చి రోడ్డులో ఉన్న తేజ డీవీఆర్ కళాశాలలో సోమవారం నిర్వహించిన ఫ్రెషర్స్ పార్టీ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్, నందిగామ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య పాల్గొన్నారు. కూటమి నాయకులతో కలిసి హాజరైన ఆమె నూతనంగా కళాశాలలో అడుగుపెట్టిన విద్యార్థులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా మాట్లాడిన తంగిరాల సౌమ్య, విద్యార్థి (మిగతా 2వ పేజీలో)

# నేటి రాశి ఫలాలు

మేషం: వృత్తి వ్యాపారాలలో కీలక నిర్ణయాలు అమలు పరుస్తారు. నూతన వ్యక్తుల పరిచయాలు ఉత్సాహాన్నిస్తాయి. స్థిరాస్తి కొనుగోలు ప్రయత్నాలు ఫలిస్తాయి. ఉద్యోగాలు మరింత అనుకూలంగా సాగుతాయి. కుటుంబ సభ్యుల నుండి శుభవార్తలు వింటారు. రాజకీయ వర్గాల వారి నుండి ఊహించని ఆహ్వానాలు అందుతాయి.

వృషభం: స్థిరాస్తి ఒప్పందాలు వాయిదా పడతాయి. బంధుమిత్రులతో చిన్నపాటి వివాదాలు తప్పవు. చేపట్టిన పనుల్లో అవాంతరాలు ఉంటాయి. వ్యాపార ఉద్యోగాలు మందకొడిగా సాగుతాయి. ఆర్థిక ఇబ్బందులు వలన నూతన ఋణ ప్రయత్నాలు చేస్తారు. ఆరోగ్య విషయంలో వైద్య సంప్రదింపులు చేయవలసి వస్తుంది.

మిథునం: దైవ సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు. చేపట్టిన పనులు ముందుకు సాగక చికాకులు పెరుగుతాయి. వ్యాపారాలు, ఉద్యోగాలలో ఒత్తిడులు పెరుగుతాయి. బంధుమిత్రులతో స్వల్ప వివాదాలు ఉంటాయి. ఆస్తి వ్యవహారంలో పెద్దల సలహాలు తీసుకుని ముందుకు సాగడం మంచిది.

కర్కాటకం: భూ సంబంధిత క్రయ విక్రయాలలో లాభాలు అందుకుంటారు. కుటుంబ సభ్యులతో శుభకార్యాలలో పాల్గొంటారు. వృత్తి ఉద్యోగాల్లో పదోన్నతులు పెరుగుతాయి. అధికంగా ఇబ్బందులు ఉన్నప్పటికీ అవసరానికి ధన సహాయం అందుతుంది. చేపట్టిన వ్యవహారాలు సానుకూలమవుతాయి.

సింహం: ఆధ్యాత్మిక చింతన పెరుగుతుంది. ముఖ్యమైన పనులు వాయిదా వేస్తారు. ఇతరులపై మీ అభిప్రాయాన్ని మార్చుకోవడం మంచిది. వ్యాపారాలు, ఉద్యోగాలు నత్తనడకన సాగుతాయి. ముఖ్యమైన వ్యవహారాలలో ఆలోచనలు నిలకడగా ఉండవు. కుటుంబ వాతావరణం గందరగోళంగా ఉంటుంది.

కన్య: చిన్ననాటి విషయాలు గుర్తుకువస్తాయి. వ్యాపారాలు, ఉద్యోగాలలో మరింత పురోగతి సాధిస్తారు. గృహమున శుభకార్యాలు నిర్వహిస్తారు. బంధువుల ఆగమనం ఆనందం కలిగిస్తుంది. ఆకస్మిక ధనలాభ సూచనలు ఉన్నవి. చేపట్టిన పనులు సకాలంలో పూర్తి చేస్తారు. నిరుద్యోగులకు శుభవార్తలు అందుతాయి.

తుల: ఆధ్యాత్మక సేవా కార్యక్రమాల్లో పాల్గొంటారు. వ్యాపార ఉద్యోగాలు సామాన్యంగా సాగుతాయి. చిన్ననాటి మిత్రులతో అకారణ విభేదాలు కలుగుతాయి. చేపట్టిన వ్యవహారాలు ముందుకు సాగక నిరాశ పెరుగుతుంది. ఆర్థిక లావాదేవీలు నిరుత్సాహపరుస్తాయి. శ్రమతో కానీ కొన్ని పనులు పూర్తి కావు.

వృశ్చికం: వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి. ఉద్యోగాలలో ఒత్తిడులు తొలగుతాయి. నూతన విషయాలపై ఆసక్తి పెరుగుతుంది. ఆకస్మిక ధన, వస్తులాభాలు పొందుతారు. దాయాదులతో భూవివాదాలు పరిష్కారమౌతాయి. చిన్ననాటి మిత్రులతో శుభకార్యాలలో పాల్గొంటారు.

ధనస్సు: చిన్ననాటి మిత్రుల కలయిక సంతోషాన్నిస్తుంది. వ్యాపారాలు, ఉద్యోగాలు మరింత మెరుగ్గా ఉంటాయి. అనుకున్న పనులు అనుకున్న సమయానికి పూర్తి చేయగలుగుతారు. ప్రయాణాలలో నూతన పరిచయాలు భవిష్యత్తుకు ఉపయోగపడతాయి. నిరుద్యోగులకు చాలాకాలంగా ఎదురు చూస్తున్న అవకాశాలు లభిస్తాయి.

మకరం: ముఖ్యమైన పనులు మందగిస్తాయి. ఆకస్మిక ప్రయాణ సూచనలు ఉన్నవి. కుటుంబ వ్యవహారాలలో ఆలోచనలు స్థిరంగా ఉండవు. బంధువులతో మాటపట్టింపులు ఉంటాయి. ఆరోగ్య విషయంలో మరింత అప్రమత్తంగా వ్యవహరించాలి. వ్యాపారాలు, ఉద్యోగాలు అంతంత మాత్రంగా సాగుతాయి.

కుంభం: ప్రయాణాలు వాయిదా వేయుట మంచిది. వ్యాపార పెట్టుబడుల విషయంలో పునరాలోచన చేయడం మంచిది. చేపట్టిన పనులలో అవాంతరాలు కలుగుతాయి. ఆలయాలు సందర్శిస్తారు. ఉద్యోగాలు సామాన్యంగా ఉంటాయి. ఇంటా బయట కొందరు మాటలు మానసికంగా బాధిస్తాయి. ఆరోగ్య విషయంలో శ్రద్ధ వహించాలి.

మీనం: ఉద్యోగాలలో మీ ప్రతిభ వెలుగులోకి వస్తుంది. సన్నిహితులతో వివాదాలు పరిష్కార దిశగా సాగుతాయి. అధికారుల నుండి ప్రశంసలు అందుకుంటారు. వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి. ఆధ్యాత్మిక చింతన పెరుగుతుంది. చేపట్టిన వ్యవహారాలలో విజయం సాధిస్తారు. శుభకార్యాల రీత్యా ఖర్చులు అధికమవుతాయి.



# అగ్నిమాపక సేవలు మరింత బలోపేతం

(మొదటి పేజీ తరువాయి)

ఈ కేంద్రాల ఏర్పాటుతో ప్రజలకు అత్యవసర సేవలు మరింత వేగంగా అందుబాటులోకి వస్తాయని పేర్కొన్నారు. నూతన కేంద్రాల ఏర్పాటు కోసం ప్రభుత్వం రూ. 7.80 కోట్ల వ్యయంతో అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించినట్లు హోంమంత్రి తెలిపారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, అత్యవసర పరిస్థితుల్లో ఉపయోగపడే పరికరాలు, సిబ్బందికి అవసరమైన వసతులను సమకూర్చినట్లు చెప్పారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో అగ్నిప్రమాదాలు, ఇతర విపత్తుల సమయంలో వేగంగా స్పందించే విధంగా ఈ కేంద్రాలను అభివృద్ధి చేసినట్లు వివరించారు. ప్రజల ప్రాణాలు, ఆస్తులను కాపాడేందుకు అగ్నిమాపక సిబ్బంది నిరంతరం అంకితభావంతో పనిచేస్తున్నారని అనిత కొనియాడారు. విపత్తుల సమయంలో ప్రాణాలను సైతం లెక్కచేయకుండా విధులు నిర్వర్తిస్తున్న సిబ్బంది సేవలు ప్రశంసనీయమని అన్నారు. అగ్నిప్రమాదాలు, రోడ్డు ప్రమాదాలు, ప్రకృతి వైపరీత్యాల సమయంలో వారు అందిస్తున్న సేవలు సమాజానికి ఎంతో విలువైనవని పేర్కొన్నారు. గత రెండేళ్లుగా అగ్నిమాపక శాఖను మరింత ఆధునికీకరించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు ఆమె తెలిపారు. కొత్త వాహనాలు, రక్షణ పరికరాలు, అత్యాధునిక అగ్నిమాపక యంత్రాలను అందుబాటులోకి తీసుకువచ్చినట్లు చెప్పారు. సిబ్బందికి శిక్షణ కార్యక్రమాలను కూడా విస్తృతంగా నిర్వహిస్తూ సేవల నాణ్యతను పెంచుతున్నామని వివరించారు. రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గంలో అగ్నిమాపక కేంద్రాలను ఏర్పాటు చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని హోంమంత్రి స్పష్టం చేశారు. ప్రజలకు అత్యవసర సేవలు తక్కువ సమయంలో అందేలా ప్రణాళికాబద్ధంగా కేంద్రాలను విస్తరిస్తున్నట్లు తెలిపారు. దూర ప్రాంతాల ప్రజలకు కూడా సమయానుకూల సహాయం అందించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ప్రజల భద్రత, విపత్తుల నిర్వహణ వ్యవస్థను మరింత సమర్థవంతంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని అనిత తెలిపారు. అగ్నిమాపక శాఖ బలోపేతంతో ప్రమాదాల సమయంలో స్పందన వేగం పెరగడంతో పాటు ప్రాణనష్టం, ఆస్తినష్టాన్ని గణనీయంగా తగ్గించే అవకాశం ఉంటుందని అన్నారు.





# మంగళగిరి అభివృద్ధికి లోకేశ్ హామీ

(మొదటి పేజీ తరువాయి)

అందుబాటులోకి తీసుకువస్తామని హామీ ఇచ్చారు. ప్రజలకు మెరుగైన పట్టణ వసతులు కల్పించడం ప్రభుత్వ బాధ్యత అని చెప్పారు. ఆరోగ్య రంగంలోనూ కీలక చర్యలు చేపడుతున్నామని మంత్రి వివరించారు. వచ్చే ఏడాదిలో వంద పడకల ఆసుపత్రిని ప్రారంభించి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించనున్నట్లు ప్రకటించారు. స్థానిక ప్రజలు వైద్యం కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా అన్ని సౌకర్యాలతో ఆసుపత్రిని అందుబాటులోకి తీసుకువస్తామని తెలిపారు. విద్యా రంగంలో మంగళగిరి ఆదర్శంగా నిలుస్తోందని మంత్రి పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాల్లో ప్రవేశాల కోసం పోటీ పెరగడం విద్యా ప్రమాణాల మెరుగుదలకు నిదర్శనమని అన్నారు. నాణ్యమైన విద్య అందించేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలకు ప్రజల నుంచి మంచి స్పందన లభిస్తోందని చెప్పారు. స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ప్రజల ఆశీస్సులు కూటమి అభ్యర్థులకు అందించాలని మంత్రి విజ్ఞప్తి చేశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని అమలు చేసే దిశగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని, మంగళగిరిని రాష్ట్రంలోనే ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దేందుకు కృషి కొనసాగుతుందని నారా లోకేశ్ స్పష్టం చేశారు.

# అంధుల క్రికెట్‌కు ప్రభుత్వ అండ

(మొదటి పేజీ తరువాయి)

అవసరమైన సదుపాయాలు, భవిష్యత్తులో చేపట్టాల్సిన కార్యక్రమాలపై సుదీర్ఘంగా చర్చ జరిగింది. రాష్ట్ర స్థాయిలో అంధుల క్రికెట్‌కు మరింత ప్రాధాన్యత కల్పించి ప్రతిభావంతులైన క్రీడాకారులను ప్రోత్సహించే అంశాలు కూడా సమావేశంలో ప్రస్తావనకు వచ్చాయి. భేటీ అనంతరం మంత్రి నారా లోకేశ్ సామాజిక మాధ్యమాల వేదికగా స్పందించారు. అజయ్ కుమార్ రెడ్డిని కలవడం ఆనందంగా ఉందని పేర్కొంటూ, రాష్ట్రంలో అంధుల క్రికెట్‌ను మరింత బలోపేతం చేయడంపై చర్చించినట్లు వెల్లడించారు. రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో ప్రతిభ చాటిన క్రీడాకారులకు తగిన ప్రోత్సాహం అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ప్రత్యేకించి దృష్టిలోపం ఉన్న క్రికెటర్ల కోసం ప్రత్యేక క్రీడా మౌలిక వసతులను అభివృద్ధి చేయడం, శిక్షణా అవకాశాలు పెంచడం, క్రీడా సామగ్రి అందుబాటులో ఉంచడం వంటి అంశాలపై ప్రభుత్వం దృష్టి సారిస్తోందని మంత్రి తెలిపారు. అంధుల క్రికెట్‌కు అవసరమైన సౌకర్యాల కల్పనలో ఎలాంటి లోటు ఉండకుండా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అంధ క్రీడాకారులు తమ ప్రతిభ, పట్టుదలతో సాధిస్తున్న విజయాలు సమాజానికి స్ఫూర్తిదాయకమని లోకేశ్ కొనియాడారు. కఠిన పరిస్థితులను అధిగమించి దేశానికి గౌరవం తీసుకొస్తున్న వారి కృషిని గుర్తించి మరింత ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతిభ ఉన్న ప్రతి క్రీడాకారుడికి ప్రభుత్వం అండగా ఉంటుందని స్పష్టం చేశారు. మాజీ కెప్టెన్ అజయ్ కుమార్ రెడ్డితో జరిగిన ఈ భేటీ అంధుల క్రీడా రంగానికి కొత్త ఉత్సాహాన్ని నింపింది. ప్రభుత్వం నుంచి లభించిన హామీలతో రాష్ట్రంలోని అంధ క్రీడాకారులు, క్రీడా సంఘాలు సంతోషం వ్యక్తం చేస్తున్నాయి. రానున్న రోజుల్లో అంధుల క్రికెట్ అభివృద్ధికి మరిన్ని కార్యక్రమాలు చేపట్టే అవకాశాలు ఉన్నాయని క్రీడా వర్గాలు భావిస్తున్నాయి.

# ఏనుగుల బెడదపై అప్రమత్తం

(మొదటి పేజీ తరువాయి)

సోమవారం అటవీ శాఖ ఉన్నతాధికారులతో ప్రత్యేక సమీక్ష నిర్వహించి పరిస్థితిని సమగ్రంగా పరిశీలించారు. గత పదిహేను రోజులుగా 11 ఏనుగులతో కూడిన గుంపు, దాని నుంచి విడిపోయిన మరో రెండు ఏనుగులు పడిపుట్లబైలు పంచాయతీ పరిధిలోని పుండ్లవల్లపల్లి, నడింపల్లి, కొండకిందపల్లి గ్రామాల్లో సంచరిస్తున్నట్లు అధికారులు వివరించారు. ఈ కారణంగా స్థానిక ప్రజలు భయాందోళనలకు గురవుతుండగా, రైతులు తమ పంటలకు తీవ్ర నష్టం వాటిల్లిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం ఒక ఏనుగుల గుంపు రహదారి దాటి మంగళంపేట బీట్ పరిధిలోకి ప్రవేశించినట్లు, మరో రెండు ఏనుగులు చిత్తూరు వైపు కదులుతున్నట్లు అధికారులు తెలిపారు. ఈ కదలికల నేపథ్యంలో పాకాల, పులిచెర్ల, చంద్రగిరి మండలాల ప్రజలకు ముప్పు పొంచి ఉండే అవకాశం ఉందని అటవీ శాఖ అంచనా వేస్తోంది. దీంతో ముందస్తు చర్యలు చేపట్టాలని నిర్ణయించారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ మాట్లాడుతూ ప్రజల ప్రాణాలు, ఆస్తుల రక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని స్పష్టం చేశారు. మానవ-ఏనుగు ఘర్షణలు చోటుచేసుకోకుండా క్షేత్రస్థాయిలో నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని సూచించారు. ఏనుగుల కదలికలపై ఎప్పటికప్పుడు సమాచారం సేకరించి గ్రామస్తులను అప్రమత్తం చేయాలని ఆదేశించారు. ఏనుగులను సురక్షితంగా అడవిలోకి మళ్లించేందుకు ముసలమడుగు శిబిరం నుంచి కుంకీ ఏనుగులను రంగంలోకి దించాలని ఆయన స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. అటవీ, పోలీసు, రెవెన్యూ, విద్యుత్ శాఖలతో పాటు ప్రత్యేక బృందాలు పరస్పర సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రమాద ప్రాంతాల్లో రాత్రింబవళ్లు నిఘా కొనసాగించాలని ఆదేశించారు. ఏనుగుల దాడులతో పంటలు నష్టపోయిన రైతులకు తక్షణమే పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని ఉప ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. ప్రజలకు ఎలాంటి హాని కలగకుండా చూడటంతో పాటు వన్యప్రాణుల సంరక్షణకు కూడా ప్రాధాన్యత ఇవ్వాలని పేర్కొన్నారు. ప్రజల భద్రత, పంటల పరిరక్షణ, వన్యప్రాణుల సంరక్షణ అనే మూడు అంశాలను సమన్వయం చేస్తూ చర్యలు కొనసాగించాలని ఆయన స్పష్టం చేశారు.



# వాయుగుండం దెబ్బకు రోడ్ల నష్టం

(మొదటి పేజీ తరువాయి)

శాఖ పరిధిలో మొత్తం 2405 కిలోమీటర్ల మేర రహదారులు నష్టపోయినట్లు ప్రాథమిక అంచనాలు వెల్లడించాయని చెప్పారు. ఈ నష్టాన్ని సమగ్రంగా అంచనా వేసేందుకు అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలనలు కొనసాగిస్తున్నట్లు తెలిపారు. దెబ్బతిన్న రహదారుల పునరుద్ధరణ కోసం సుమారు రూ. 1,498.30 కోట్ల వ్యయంతో ప్రాథమిక ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు మంత్రి వెల్లడించారు. రవాణా వ్యవస్థ సాధారణ స్థితికి చేరుకునేలా అత్యవసర మరమ్మతు పనులను ప్రాధాన్య క్రమంలో చేపడతామని పేర్కొన్నారు. ప్రజల రాకపోకలకు ఆటంకం కలగకుండా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. విపత్తు సమయంలో ఆర్ అండ్ బీ శాఖ అధికారులు, ఇంజినీర్లతో నిరంతరం సమీక్షలు నిర్వహించినట్లు మంత్రి చెప్పారు. క్షేత్రస్థాయి యంత్రాంగాన్ని అప్రమత్తం చేసి దెబ్బతిన్న ప్రాంతాల్లో వెంటనే స్పందించేలా ఆదేశాలు జారీ చేసినట్లు వివరించారు. వర్షాల వల్ల ప్రమాదాలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకున్నామని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తోందని మంత్రి పేర్కొన్నారు.

# విద్యార్థుల భవిష్యత్తుకు అండ

(మొదటి పేజీ తరువాయి)

దశ జీవితంలో అత్యంత కీలకమైందని పేర్కొన్నారు. క్రమశిక్షణ, పట్టుదల, నిరంతర కృషితో ఉన్నత లక్ష్యాలను సాధించాలని విద్యార్థులకు సూచించారు. విద్యార్థులే దేశ భవిష్యత్తు అని, యువత అభివృద్ధి ద్వారానే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమవుతుందని అన్నారు. కూటమి ప్రభుత్వం విద్య, నైపుణ్యాభివృద్ధి, ఉపాధి అవకాశాల కల్పనకు ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని ఆమె తెలిపారు. విద్యార్థులు చదు వుతో పాటు ఆధునిక నైపుణ్యాలను కూడా పెంపొం దించుకుని భవిష్యత్తులో ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. మారుతున్న కాలానికి అనుగుణంగా తమ సామర్థ్యాలను అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. ఫ్రెషర్స్ పార్టీ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు, ఆటపాటలు, వినోద ప్రదర్శన లు ఆకట్టుకున్నాయి. నూతన విద్యార్థులకు సీనియర్ విద్యార్థులు స్వాగతం పలుకుతూ నిర్వహించిన కార్యక్రమా లు ఉత్సాహభరిత వాతావరణాన్ని సృష్టించాయి. విద్యార్థుల తో ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య ఆత్మీయంగా ముచ్చటించి వారి అభిప్రాయాలు తెలుసుకున్నారు.

# వరద ప్రభావిత వరి పంటల రక్షణే ప్రధాన లక్ష్యం

(మొదటి పేజీ తరువాయి)

అన్నారు. సంతబొమ్మాళి మండలంలోని హెచ్.ఎన్.పేట గ్రామంతో పాటు పలు ముంపు ప్రాంతాల్లో ఆచార్య ఎన్.జి. రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉపకులపతి డాక్టర్ పి.వి. సత్యనారాయణ, వ్యవసాయ శాస్త్రవేత్తల బృందంతో కలిసి ఆయన క్షేత్రస్థాయిలో పర్యటించి వరద ప్రభావిత పంటలను పరిశీలించారు. రైతులకు కలిగిన నష్టాన్ని అంచనా వేసి పంటలను గట్టెక్కించేందుకు అవసరమైన చర్యలపై అధికారులతో చర్చించారు. అనంతరం నిమ్మాడ క్యాంపు కార్యాలయంలో వ్యవసాయ శాఖ అధికారులు, శాస్త్రవేత్తలతో ప్రత్యేక సమీక్ష నిర్వహించిన మంత్రి అచ్చెన్నాయుడు, పొలాల్లో నిల్వ ఉన్న నీరు పూర్తిగా తగ్గిన వెంటనే పంట రక్షణ, పునరుద్ధరణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రతి ప్రాంతంలోని పరిస్థితులను పరిశీలించి పంట వయస్సు, నష్టం తీవ్రత ఆధారంగా కార్యాచరణ రూపొందించాలని సూచించారు. రైతులకు క్షేత్రస్థాయిలో సాంకేతిక మార్గదర్శకాలు అందించాలని అధికారులకు తెలిపారు. వరి పొలాల్లో ఎక్కువ రోజులు నీరు నిల్వ ఉండటం వల్ల తెగుళ్లు, చీడపీడల సమస్యలు పెరిగే ప్రమాదం ఉందని మంత్రి పేర్కొన్నారు. అందువల్ల రైతులు తొందరపడి అధిక మొత్తంలో ఎరువులు లేదా పురుగుమందులు వినియోగించవద్దని సూచించారు. సమీప రైతు సేవా కేంద్రాలు, వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తల సలహాలు తీసుకున్న తర్వాత మాత్రమే పంట సంరక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. శాస్త్రీయ విధానాల ద్వారానే పంటలను కాపాడుకోవచ్చని అన్నారు. నత్రజని, పొటాషియం వంటి పోషకాలను అవసరానికి అనుగుణంగా శాస్త్రీయ పద్ధతుల్లో అందించాలని మంత్రి అచ్చెన్నాయుడు సూచించారు. ప్రతి పొలం పరిస్థితి భిన్నంగా ఉండటంతో ఒకే విధానాన్ని అనుసరించకుండా నిపుణుల సలహాలతో ముందుకు వెళ్లాలని తెలిపారు. వరదల ప్రభావంతో బలహీనపడిన పంటలకు ప్రత్యేక సంరక్షణ చర్యలు అవసరమని పేర్కొన్నారు. ముంపు ప్రాంతాల్లో పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించేందుకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించాలని అధికారులకు ఆదేశించారు. అవసరమైన చోట డ్రోన్ల సహాయంతో పంటల పరిస్థితిని పరిశీలించి తక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. జిల్లా యంత్రాంగం, వ్యవసాయ శాఖ అధికారులు, శాస్త్రవేత్తలు బృందాలుగా ఏర్పడి ప్రతి ప్రభావిత గ్రామాన్ని సందర్శించి రైతులకు అవసరమైన సాంకేతిక సహాయం అందించాలని ఆదేశించారు. నష్టం జరిగిన తర్వాత స్పందించడం కంటే ముందస్తుగా పంటను కాపాడుకోవడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. రైతులు ఆందోళన చెందకుండా వ్యవసాయ శాఖ అధికారులతో సమన్వయం చేసుకుంటూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు.

శ్వేత

# సంపాదకీయం

## మంగళవారం 29-9-2026

# కేంద్రంలో బీజేపీ పాలన... కొత్త సవాళ్లు...

### ప్రజల అంచనాలే అసలైన పరీక్ష

ఒక ప్రభుత్వం వరుసగా మూడోసారి అధికారంలోకి రావడం సాధారణ విషయం కాదు. కానీ మూడోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజల అంచనాలను అందుకోవడం అంతకంటే పెద్ద సవాలు. కేంద్రంలో బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ 11 ఏళ్ల పాలనను పూర్తి చేసుకుని మూడోసారి అధికారంలో ఉన్న నేపథ్యంలో ఇప్పుడు అసలు పరీక్ష మొదలైంది. సాధించిన విజయాలను కాపాడుకోవడంతో పాటు, పెరుగుతున్న ప్రశ్నలకు సమాధానాలు చెప్పాల్సిన బాధ్యత కూడా అంతే పెద్దది. మౌలిక సదుపాయాలపై కేంద్రం దృష్టి గణనీయంగా పెరిగింది. జాతీయ రహదారులు, రైల్వే ఆధునికీకరణ, వందే భారత్, విమానాశ్రయాలు, గ్రామీణ రహదారులు, డిజిటల్ మౌలిక వసతుల విస్తరణలో వేగం కనిపించింది. ఇళ్లు, తాగునీరు, విద్యుత్తు, డిజిటల్ కనెక్టివిటీ వంటి రంగాల్లోనూ పెద్ద ఎత్తున కార్యక్రమాలు జరిగాయి. జన్-ధన్, ఆధార్, యూపీఐ, డీబీటీ కలయిక సంక్షేమ పంపిణీ విధానాన్ని మార్చింది. ఉజ్వల, పీఎం ఆవాస్, ఆయుష్మాన్ భారత్ వంటి పథకాలు కోట్లాది కుటుంబాలను తాకాయి. అయితే అభివృద్ధి గణాంకాలకే పరిమితం కాకూడదు. యువతకు నాణ్యమైన ఉద్యోగాలు, స్థిరమైన ఆదాయం, చిన్న వ్యాపారాలకు భరోసా, కుటుంబాలపై ధరల భారాన్ని తగ్గించడం తదుపరి దశలో కీలకం. విద్య, నైపుణ్యం, ఉపాధి మధ్య ఉన్న అంతరాన్ని పూడ్చడం పెద్ద పరీక్ష. నోట్ల రద్దు ప్రభావం, జీఎస్టీ తొలి దశలో చిన్న వ్యాపారులు, అసంఘటిత రంగం ఎదుర్కొన్న ఇబ్బందులు ఇప్పటికీ చర్చలోనే ఉన్నాయి. జీఎస్టీ పన్ను వ్యవస్థను ఏకీకృతం చేసినా, అమలులోని సమస్యల నుంచి పాఠాలు నేర్చుకోవాల్సిందే. ప్రజలకు అభివృద్ధి ఎంత ముఖ్యమో, రోజువారీ జీవన వ్యయం కూడా అంతే ముఖ్యం. ఈడీ, సీబీఐ, ఐటీ వంటి సంస్థల చర్యలపై రాజకీయ వివాదం కొనసాగుతోంది. 2014--2022 మధ్య ఈడీ పరిశీలించిన 121 మంది ప్రముఖ రాజకీయ నాయకుల్లో 115 మంది ప్రతిపక్షాలకు చెందినవారేనని ఇండియన్ ఎక్స్‌ప్రెస్ అధ్యయనం పేర్కొంది. కేంద్ర ప్రభుత్వం మాత్రం దర్యాప్తులు రాజకీయ ప్రేరేపితమైనవి కావని, ఆధారాల ఆధారంగానే జరుగుతున్నాయని చెబుతోంది. ఆరోపణలు ఏవైనా, ప్రజాస్వామ్యంలో కీలకమైనది ఒక్కటే, దర్యాప్తు సంస్థలు అధికార పక్షానికైనా, ప్రతిపక్షానికైనా ఒకే ప్రమాణంతో వ్యవహరిస్తున్నాయన్న నమ్మకం.

ఇక్కడే బీజేపీకి ఒక కొత్త తరహా సవాలు ఎదురవుతోంది. ఆర్ఎస్ఎస్--బీజేపీకి దశాబ్దాల సంస్థాగత అనుభవం, క్రమశిక్షణ, బలమైన కేడర్ ఉన్నాయి. అవి పార్టీకి బలాలే. కానీ జెన్-జెడ్ తో సంభాషించడానికి అవే పద్ధతులు సరిపోతాయా? స్మార్ట్‌ఫోన్‌తో పెరిగిన ఈ తరం ప్రశ్నిస్తుంది. వెంటనే సమాధానం కోరుతుంది. ఉద్యోగం కావాలి. పరీక్షలు పారదర్శకంగా ఉండాలి. పేపర్ లీకులు వద్దు. సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం వద్దు. ప్రభుత్వ నిర్ణయాలు తమ జీవితాలను ఎలా ప్రభావితం చేస్తున్నాయో తెలుసుకోవాలని అనుకుంటుంది. 2026లో పరీక్షల సంస్కరణలపై యువత ఆందోళనలు ఈ మారుతున్న రాజకీయ భాషను స్పష్టంగా చూపించాయి.

అందుకే బీజేపీకి ఇప్పుడు యువత కోసం కార్యక్రమాలు మాత్రమే కాదు, యువతతో కలిసి ఆలోచించే నాయకత్వం అవసరం. పాత అనుభవాన్ని పక్కన పెట్టాల్సిన అవసరం లేదు. కానీ దానికి కొత్త ఆలోచన, పదునైన మేధస్సు, డిజిటల్ ప్రపంచాన్ని అర్థం చేసుకునే వ్యూహం జత కావాలి. పాత గుర్రాలను మార్చడం కాదు, పాత అనుభవానికి కొత్త మెదళ్లను జోడించడం అత్యవసరం. జెన్-జెడ్ ను ఓటు బ్యాంకుగా చూడటం ఎంత ప్రమాదమో, తమకు అనుకూలంగా ఉన్న తరంగా భావించడం కూడా అంతే ప్రమాదం. అది ఒకే రాజకీయ వైఖరి కలిగిన సమూహం కాదు. ఢిల్లీ విశ్వవిద్యాలయ విద్యార్థి సంఘ ఎన్నికల్లో ఏబీవీపీ మూడు ప్రధాన పదవులు గెలవడం యువతలో బీజేపీ అనుబంధ విద్యార్థి రాజకీయాలకు మద్దతు ఉందని చూపించినా, దానిని మొత్తం జెన్-జడ్ అభిప్రాయంగా చూడటం తొందరపాటే.

మూడోసారి అధికారం అంటే మరో ఐదేళ్ల అవకాశం మాత్రమే కాదు. గత విజయాలను కాపాడుకుంటూనే, గత లోపాల నుంచి నేర్చుకోవాల్సిన దశ. యువతకు ఉద్యోగాలు, విద్యార్థులకు పారదర్శక పరీక్షలు, ఓటరుకు విశ్వసనీయ ఎన్నికల వ్యవస్థ, పౌరుడికి న్యాయమైన పాలన, ఇవే ఇప్పుడు అసలు అంచనాలు. బలమైన ప్రభుత్వం కావాలి. అదే సమయంలో బలమైన సంస్థలు, బలమైన ప్రతిపక్షం కూడా కావాలి. ఆర్థిక వృద్ధి కావాలి. అదే సమయంలో సామాజిక శాంతి, ప్రజాస్వామ్య సంస్థలపై విశ్వాసం కూడా కావాలి. చివరికి ఒక ప్రభుత్వాన్ని కొలిచేది అది ఎన్ని సంవత్సరాలు అధికారంలో ఉందన్నది కాదు. ఆ సంవత్సరాల్లో ప్రజల నమ్మకాన్ని ఎంత బలపరిచిందన్నదే. మూడోసారి అధికారంలో ఉన్న బీజేపీకి అసలైన పరీక్ష ఇదే, గతాన్ని గౌరవిస్తూ భవిష్యత్తును అర్థం చేసుకోవడం. నిన్నటి అనుభవంతో పాటు రేపటి మెదళ్లను ముందుకు తేవడం, జెన్-జడ్ కంటే ఒక అడుగు ముందుగా ఆలోచించగల నాయకత్వమే రాబోయే రాజకీయ సవాళ్లను ఎదుర్కోగలదు.



# రాష్ట్రస్థాయి పోటీలలో మేడ్చల్ జిల్లా అథ్లెట్ల ప్రతిభ

మేడ్చల్, సెప్టెంబర్ 28: రాష్ట్ర అథ్లెటిక్స్‌లో మేడ్చల్ క్రీడాకారులు సత్తా చాటారు. హనుమకొండ లోని జె.ఎన్. స్టేడియంలో సెప్టెంబర్ 26, 27 తేదీల్లో జరిగిన 12వ తెలంగాణ రాష్ట్ర జూనియర్, సీనియర్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్స్ -2026లో మేడ్చల్ జిల్లా క్రీడాకారులు సత్తా చాటారు. మహిళల 800 మీటర్ల పరుగులో పోత్రకుండ సరిత 2:45.96 నిమిషాల్లో స్వర్ణ పతకం, 400 మీటర్లలో 1:07.81 నిమిషాలతో కాంస్య పతకం సాధించారు. రెండు విభాగాల్లోనూ వ్యక్తిగత అత్యుత్తమ ప్రదర్శన నమోదు చేసినట్లు కోచ్ తిరుమలరావు బోరాడి తెలిపారు. గరిగే అభినయశ్రీ అండర్--16 బాలికల రిలేలో రజత పతకం సాధించారు. పెంటాథ్లాన్‌లో 3,160 పాయింట్లతో ఐదో స్థానం పొందారు. లాంగ్‌జంప్‌లో 5 మీటర్ల అప్రోచ్‌తో 3.71 మీటర్లు దూకారు. జాతీయ అర్హత ప్రమాణం 3.50 మీటర్లు ఉన్నప్పటికీ, తదుపరి అవకాశం లభించక జాతీయ పోటీలకు వెళ్లే అవకాశం కోల్పోవడం కొంత నిరాశ కలిగించింది. మహిళల 1500 మీటర్ల పరుగులో వలురౌతు దిల్లేశ్వరి కాంస్య పతకం సాధించారు. ఆమె 7:21.44 నిమిషాల్లో రేసును పూర్తి చేశారు. మహిళల ట్రిపుల్ జంప్‌లో కొత్తపల్లి సృజన 7.92 మీటర్లతో స్వర్ణ పతకం సాధించారు. రాష్ట్రస్థాయిలో స్వర్ణ పతకం సాధించడం ఆమెకు ఇదే తొలిసారి. పురుషుల 1500 మీటర్లలో పి. శ్రీనివాస్ 7వ స్థానం, అండర్--18 హర్డిల్స్, హెప్టాథ్లాన్‌లో సి.హెచ్. గణేష్ 5వ స్థానం, 400 మీటర్లలో పి. దిలీప్ 5వ స్థానం, 1000 మీటర్లలో ఎన్. చింటూ 11వ స్థానం సాధించారు. క్రీడాకారుల పట్టుదల, క్రమశిక్షణ కి అభినందనీయమని కోచ్ తిరుమలరావు బోరాడి తెలిపారు. నిరంతర సాధనతో రాష్ట్ర, జాతీయ స్థాయిలో మరిన్ని విజయాలు సాధించవచ్చని సూచించారు. క్రమశిక్షణ, నిరంతర సాధన, పట్టుదలే క్రీడాకారుల విజయానికి బలమైన పునాది అని అన్నారు. రాష్ట్రస్థాయి పోటీలకు ప్రోత్సహిస్తున్న తల్లిదండ్రులు ధర్మేంద్ర,సంతోష్ ,వెంకటేష్,సంజీవరావు మధు, కోచ్ తిరుమలరావు బోరాడి కృతజ్ఞతలు తెలిపారు.



# గణనాధుల నిమజ్జనంలో ఆకట్టుకున్న గాన లహరి...

### శ్రీకృష్ణ మ్యూజికల్ ఈవెంట్స్ టీం ప్రదర్శన

మల్కాజ్గిరి, కాప్రా సెప్టెంబర్ 27 (స్టార్ న్యూస్) : ఇటీవల జరిగిన వినాయక నిమజ్జనం వేడుకల్లో శ్రీకృష్ణ మ్యూజికల్ ఈవెంట్స్ టీం ప్రదర్శించిన భక్తి గీతాల గానలహరి సందర్శకులను ఎంతగానో ఆకట్టుకుంది. మల్కాజ్గిరి సఫిల్ గూడ చెరువు, కాప్రా చెరువుల వద్ద తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ వారి ప్రోత్సాహ సహకారంతో, భాగ్యనగర గణేష్ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన స్వాగత వేదికలపై ఆర్గనైజర్/సింగర్ కీసరి శ్రీనివాస చారి ఆధ్వర్యంలో గాయనీ గాయకులు సోమేష్, రామకృష్ణ చారి, బాలకృష్ణ, శ్రీమతి పావని(సంగీత అధ్యాపకురాలు), శ్రీమతి కావ్య, శ్రీమతి సాయి పావని, శ్రీమతి శోభారాణి(విశ్వకర్మ సంఘం మహిళా అధ్యక్షురాలు)లు తమ గానంతో భక్తులను ఉర్రూతలూగించారు. మల్కాజ్ గిరి పోలీస్ కమిషనరేట్ కమిషనర్ సుమతి మేడంతో పాటు వివిధ పార్టీల నాయకులు, భాగ్యనగర్ ఉత్సవ సమితి ప్రతినిధులు వారిని ప్రశంసించారు. కీసరి శ్రీనివాస చారి గాయక బృందం ప్రేక్షకుల కరతాళ ధ్వనులతో పాటు స్థానికుల మెప్పును, పురస్కారాలను అందుకున్నారు.





# వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ ఎలక్షన్ల సన్నాహక సమావేశం

జంగారెడ్డిగూడెం, సెప్టెంబర్ 28, స్థానిక ఆర్యవైశ్య కళ్యాణమండపంలో సోమవారం జంగారెడ్డిగూడెం మున్సిపాలిటీ మరియు స్థానిక సంస్థల ఎన్నికల సన్నద్ధతపై చింతలపూడి నియోజకవర్గ ఇన్చార్జ్ కంభం విజయ రాజు అధ్యక్షతన సమీక్ష సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా పార్టీ రీజినల్ కోఆర్డినేటర్, మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్ గారు, జిల్లా పార్టీ అధ్యక్షులు కైకలూరు మాజీ ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(ణచీ=) పాల్గొన్నారు. వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు పార్టీ నాయకులు, కార్యకర్తలు సమాయత్తం కావాలని స్థానిక సంస్థల ఎన్నికల్లో ఏకగ్రీవాలకు అవకాశం లేకుండా పార్టీ తరఫున అభ్యర్థులు పోటీ చేసేలా ముందస్తు చర్యలు చేపట్టి, నామినేషన్లు దాఖలు చేసే విధంగా నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని, అలాగే పార్టీ కోసం కష్టపడి పనిచేసే ప్రతి నాయకుడు, కార్యకర్తకు తప్పకుండా తగిన గుర్తింపు, ప్రాధాన్యత ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకులు ఎమ్మెల్సీ వంకా రవీంద్రనాథ్ , పోలవరం నియోజవర్గ ఇంచార్జ్ తెల్లం బాలరాజు, దెందులూరు నియోజకవర్గం ఇంచార్జ్ కొఠారు అబ్బాయి చౌదరి, కృష్ణాజిల్లా పార్లమెంటు పరిశీలకులు జెట్టి గురునాథ రావు, జంగారెడ్డిగూడెం టౌన్ పార్టీ అధ్యక్షులు కర్పూరం గుప్తా, మండల అధ్యక్షులు ఓరుగంటి నాగేంద్ర కుమార్, బి వి ఆర్ చౌదరి, మేడవరపు విద్యాసాగర్, నాయకులు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.







# ప్రభుత్వ రాజముద్రతో పట్టాదార్ పాస్ పుస్తకాలు

**యూబీఐ సీఎస్ఆర్ నిధులతో RO ప్లాంట్ ప్రారంభం**

**అభివృద్ధి సంక్షేమం రెండు కళ్ళుగా కూటమి ప్రభుత్వం**

**ఉత్తరాంధ్ర అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కృషి**

**మంత్రి కొండపల్లి శ్రీనివాస్**

గజపతినగరం, సెప్టెంబర్ 28, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రభుత్వ రాజముద్రతో రైతన్నలకు పట్టాదారు పాస్ పుస్తకాలు అందించడం జరుగుతుందని రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన, ప్రవాసాంధ్రుల సాధికారత సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పేర్కొన్నారు. సోమవారం

గజపతినగరం మండలం ఎం.కొత్తవలస గ్రామంలో యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా , సీఎస్ఆర్ 10 లక్షల రూపాయలతో నిర్మించిన ఆర్వో మంచినీటి ప్లాంట్ ను మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ప్రారంభించారు. శుద్ధి చేయబడిన మంచినీటిని తాగటం ద్వారా ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవచ్చున్నారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు తక్కువ ధరకే మంచి నీటిని అందించడం కోసం ఎలక్ట్రికల్ వాహనం ద్వారా ఆర్ఓ మంచినీటిని అందజేయడం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు వినియోగించుకుని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని మంత్రి సూచించారు. అనంతరం ముచ్చర్ల గ్రామంలో 1166 మంది రైతన్నలకు పట్టాదారు పాస్ పుస్తకాలను అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్ని శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. అనంతరం జరిగిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం రెండూ సమపాళ్లలో ముందుకు వెళ్తున్నాయన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా పెన్షన్ వ్యవస్థను అమలు చేస్తున్నామన్నారు. స్కూల్ కి వెళు న్న ప్రతి విద్యార్థికి తల్లికి వందనం పథకం అమలు చేస్తున్నామని, అన్నదాత సుఖీభవ కింద ప్రతి రైతుకు రూ.20,000 ఇస్తున్నామన్నారు. స్త్రీ శక్తి పథకం ద్వారా ప్రతి మహిళకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించామని, దీపం పథకం ద్వారా ప్రతి కుటుంబానికి ఏడాదికి 3 గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇస్తున్నామన్నారు. ప్రతి గ్రామంలో అభివృద్ధి పరుగులు పెడుతోందనీ, యువనేత మంత్రి నారా లోకేష్ యువగళం పాదయాత్రలో ఇచ్చిన మాట ప్రకారం యువతకు 20 లక్షల ఉ ద్యోగాలు కల్పించడమే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నాం. అందులో భాగంగా ఉత్తరాంధ్ర ప్రాంత ప్రజల వలసలను ఆపడం కోసం ఉత్తరాంధ్రలో అనేక పరిశ్రమలు స్థాపించడం జరుగుతుందని మంత్రి కొండపల్లి పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంలో సర్వేలు చేయించి, పట్టాదారు పుస్తకాలపై వ్యక్తుల ఫోటోలు వేసి ప్రజలను భయభ్రాంతులకు గురిచేశారు. పట్టాదారు పాస్ పుస్తకాలపై జగన్ ఫోటో వేసుకుని ప్రజల్లో ఆందోళన కలిగించారని మంత్రి విమర్శించారు. ప్రభుత్వం అధికారంలోకి రాగానే రీ సర్వే చేయించి రైతు పేరిట ప్రభుత్వం రాజముద్రలతో పట్టాదారు పాస్ పుస్తకాలు అందిస్తున్న ఘనత కూటమి ప్రభుత్వాన్నిదన్నారు. పంచాయతీరాజ్ శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ ఆధ్వర్యంలో దేశంలోనే ఐదో స్థానంలో నిలవడం గర్వకారణం అన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి పొలిట్ బ్యూరో సభ్యురాలు గంట్యాడ శ్రీదేవి, ఏఎంసీ చైర్మన్ పివివి గోపాలరాజు, తూర్పు కాపు సంఘ డైరెక్టర్ జి గోవింద, టిడిపి సీనియర్ నాయకులు మక్కువ శ్రీధర్, లెంక బంగారు నాయుడు, లెంక చిన్నంనాయుడు అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# జిల్లాస్థాయి పీజీఆర్ఎస్‌కు 200 అర్జీలు

**ప్రతి అర్జీపైనా ప్రత్యేక దృష్టిపెట్టండి**

**అర్జీదారులు సంతృప్తి చెందేలా సమస్యను పరిష్కరించండిలి**

**అధికారులతో జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ**




జిల్లాస్థాయి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పీజీఆర్ఎస్)లో ప్రజల నుంచి అందిన ప్రతి అర్జీని అత్యంత ప్రాధాన్యతతో పరిశీలించి, నిర్ణీత సమయంలోగా పరిష్కరించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన జిల్లాస్థాయి పీజీఆర్ఎస్‌లో జేసీ ఇలక్కియ.. అధికారులతో కలిసి ప్రజల నుంచి 200 అర్జీలు స్వీకరించారు. రెవెన్యూకు సంబంధించి 67, పోలీసు శాఖకు 29, ఎంఏయూడీకు 22, సహకార శాఖకు 17, విద్యకు ఏడు, డీఆర్‌డీఏకు 7, పంచాయతీరాజ్ శాఖకు 6, వైద్య ఆరోగ్య శాఖకు 6, కాలుష్య నియంత్రణ మండలికి 5 అర్జీలు వచ్చాయి. ఇంటర్మీడియెట్ విద్య, ఉపాధికల్పనకు నాలుగు చొప్పున, విభిన్న ప్రతిభావంతులు, గ్రామీణ నీటి సరఫరా శాఖలకు మూడు చొప్పున, ఎస్‌జీఎస్‌డబ్ల్యూ, గృహ నిర్మాణం, మహిళా శిశు సంక్షేమం శాఖలకు రెండు చొప్పున అర్జీలు అందాయి. విద్యుత్, రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్, వ్యవసాయం, బీసీ సంక్షేమం, దేవాదాయ, బ్యాంకింగ్ సేవలు, మెప్మా, ఆర్ అండ్ బీ, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్, పౌర సరఫరాలు, ఇరిగేషన్, సాంకేతికవిద్య, జాతీయ రహదారులు, ఏపీఎస్‌డబ్ల్యూఆర్‌ఈఐఎస్‌లకు ఒక్కో అర్జీ వచ్చాయి. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ పీజీఆర్ఎస్‌కు వచ్చే ప్రతి అర్జీ వెనుక ఒక సమస్యతో పాటు ప్రజల ఆశ, నమ్మకం ఉంటుందని పేర్కొన్నారు. అర్జీదారులతో అవసరమైన సందర్భాల్లో నేరుగా మాట్లాడి సమస్య స్వరూపాన్ని తెలుసుకోవాలని, సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న అర్జీలను ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ, పరిష్కారంలో జాప్యం జరిగితే అందుకు గల కారణాలను పరిశీలించి తక్షణ చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. ప్రజా సమస్యల పరిష్కారంలో పారదర్శకత, జవాబుదారీతనం పాటిస్తూ ప్రభుత్వంపై ప్రజలకు మరింత నమ్మకం కలిగేలా అధికారులు పనిచేయాలని జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ పేర్కొన్నారు. కార్యక్రమంలో డీఆర్‌వో ఎం.లక్ష్మీనరసింహం, పీజీఆర్ఎస్ నోడల్ అధికారి జి.జ్యోతి, జిల్లాస్థాయి అధికారులు పాల్గొన్నారు.



## భగత్ సింగ్ నేటి యువతకు స్ఫూర్తిదాయకం

**మంత్రి కొండపల్లి శ్రీనివాస్**

విజయనగరం, సెప్టెంబర్ 28, స్వాతంత్ర ఉద్యమ విప్లవ నాయకుడు సర్దార్ భగత్ సింగ్ జీవితం నేటి యువతకు స్ఫూర్తిదాయకమని రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన, ప్రవాసాంధ్రుల సాధికారత సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పేర్కొన్నారు. మంత్రి క్యాంప్ కార్యాలయం నందు సోమవారం భగత్ సింగ్ 119వ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి జోహార్లు అర్పించారు. ఈ సందర్భంగా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ బ్రిటిష్ వారిని భారతదేశం నుండి తరిమికొట్టటానికి ఇంక్విలాబ్ జిందాబాద్ అంటూ ప్రజలను చైతన్యపరిచిన మహనీయుడు భగత్ సింగ్ అన్నారు. దేశ స్వేచ్ఛ కోసం అతి చిన్న వయసులోనే ప్రాణాలను సైతం లెక్కచేయకుండా బ్రిటీష్ పాలకులకు వ్యతిరేకంగా పోరాడిన ధీరుడు భగత్ సింగ్ అని కొనియాడారు. ఆయన చూపిన దేశభక్తి, ధైర్యం దేశ చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించబడ్డాయని అన్నారు. నేటి తరం యువత భగత్ సింగ్ ఆశయాలను ఆదర్శంగా తీసుకుని, దేశ ప్రగతికి మరియు సమాజ సేవకు పునరంకితం కావాలని మంత్రి కొండపల్లి పిలుపునిచ్చారు. తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు కొండపల్లి కొండలరావు, చెప్పా చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## ఎన్‌టీఆర్ జిల్లాలో వరి పంటలో ఎలుకల నివారణకు ప్రత్యేక కార్యక్రమం

ఎన్‌టీఆర్ జిల్లాలోని వరి పంట సాగు చేస్తున్న గ్రామాల్లో 29.9.2026 ఎలుకల నివారణ కార్యక్రమాన్ని వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు జిల్లా వ్యవసాయ శాఖాధికారి తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా వ్యవసాయ శాఖ క్షేత్రస్థాయి సిబ్బంది రైతులకు బ్రోమాడియోలోన్ రసాయనంతో ఎలుకల నివారణ ఎర (బైట్) తయారీ విధానాన్ని ప్రత్యక్షంగా ప్రదర్శించి అవగాహన కల్పిస్తారు. ఎలుకల నివారణకు అవసరమైన బ్రోమాడియోలోన్ రసాయనాన్ని రైతులకు 100 శాతం రాయితీపై ఉచితంగా వ్యవసాయ శాఖ ద్వారా అందజేయడం జరుగుతుంది. రైతులు తమ పొలాలకు అవసరమైన నూకలు మరియు తినదగిన నూనెను తీసుకురావాలి.

ఒక ఎకరాకు ఎర తయారీ విధానం:

బ్రోమాడియోలోన్ రసాయనం -- 2 గ్రాములు

నూనె -- 2 గ్రాములు

నూకలు -- 96 గ్రాములు

పై పదార్థాలను కలిపి తయారు చేసిన ఎరను ప్రతి సజీవ/క్రియాశీల ఎలుక బొరియలో 10 గ్రాముల చొప్పున ఉంచాలి. ఎలుకల నివారణలో మెరుగైన ఫలితాలు సాధించేందుకు గ్రామంలోని రైతులందరూ ఒకేసారి సామూహికంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టడం ఎంతో ముఖ్యమని వ్యవసాయ శాఖ సూచించింది. ముఖ్యంగా వరి పంటలో పొట్ట దశకు (Panicle Initiation) ముందుగానే ఎలుకల నివారణ చర్యలు చేపట్టడం ద్వారా ఎలుకల వల్ల పంటకు కలిగే నష్టాన్ని గణనీయంగా తగ్గించవచ్చు.

కావున ఎన్‌టీఆర్ జిల్లాలోని ఉన్న వరి రైతులు ఈ కార్యక్రమంలో చురుకుగా పాల్గొని, వ్యవసాయ శాఖ అందిస్తున్న ఈ సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వ్యవసాయ శాఖ కోరుతోంది.



## దసరా ఉత్సవాలకు కేంద్ర మంత్రికి ఆహ్వానం

కామవరపుకోట, సెప్టెంబర్ 28, మండల కేంద్రంలో కొలువై ఉన్న శ్రీ లక్ష్మీ హయగ్రీవ లలితా శ్రీ పీఠంలో దసరా ఉత్సవాలకు రావాలని ఆహ్వానం పలుకుతూ కేంద్ర ఉక్కు భారీ పరిశ్రమల సహాయ మంత్రి శ్రీ భూపతిరాజు శ్రీనివాస వర్మ కు ఆహ్వాన పత్రిక అందజేశారు. ఈ కార్యక్రమంలో పీఠం వ్యవస్థాపకులు సుదర్శనం రామ దుర్గ ఉమారాచార్యులు (దుర్గ బాబు), బిజెపి మండల అధ్యక్షులు ఎస్ ఆర్ ఆర్ లక్ష్మీ సూర్యనారాయణ రాజు తదితరులు పాల్గొన్నారు.



## నాంపల్లి రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ మరియు ఒక ప్రైవేట్ వ్యక్తి ACB వలలో చిక్కారు

**అమీర్ హుస్సేన్, క్రైమ్ బ్యూరో చీఫ్**

నల్గొండ జిల్లా, నాంపల్లి మండల తహసీల్దార్ మరియు జాయింట్ సబ్-రిజిస్ట్రార్ కార్యాలయానికి చెందిన రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ (RI) మరియు ఒక ప్రైవేట్ వ్యక్తి ాజదీ వలలో చిక్కుకున్నారు. 28.09.2026న, నల్గొండ జిల్లా నాంపల్లి మండలం తహసీల్దార్ మరియు జాయింట్ సబ్-రిజిస్ట్రార్ కార్యాలయంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న నిందిత అధికారి-1 (AO-1) శ్రీ రల్లబండి గోపరాజు, ఫిర్యాదుదారుని వ్యవసాయ భూమికి సంబంధించిన 'పంచనామా నివేదిక'ను తహసీల్దార్‌కు సమర్పించే అధికారిక పనిని చేయడానికి రూ.15,000/- లంచం డిమాండ్ చేసి స్వీకరించారు. ఈ ప్రక్రియలో ఆయన, ా-1కు సహాయకుడిగా పనిచేస్తున్న ప్రైవేట్ వ్యక్తి అయిన నిందితుడు-2 (A-2) శ్రీ అడుల్ల యాదగిరి ద్వారా లంచం మొత్తాన్ని తీసుకున్నారు. నల్గొండ రేంజ్ ఏసీబీ (ాజదీ) బృందం వీరిని పట్టుకుంది.

ా-2 వద్ద ఉన్న రూ.15,000/- లంచం సొమ్మును అతని సమక్షంలోనే స్వాధీనం చేసుకున్నారు. తద్వారా, సదరు అధికారి అక్రమ లబ్ధి పొందేందుకు తన విధిని అక్రమంగా మరియు నిజాయితీ లేకుండా నిర్వహించారు. అందువల్ల, ా-1 మరియు ా-2లను అరెస్టు చేసి, జ్యుడీషియల్ రిమాండ్ నిమిత్తం నాంపల్లిలోని ్రాజు ు ాజదీ కేసుల గౌరవనీయులైన ప్రిన్సిపల్ స్పెషల్ జడ్జి ముందు హాజరుపరుస్తున్నారు. ఈ కేసు దర్యాప్తులో ఉంది. భద్రతా కారణాల దృష్ట్యా ఫిర్యాదుదారు వివరాలు గోప్యంగా ఉంచబడ్డాయి.

# భారత సైన్యానికి 45 స్వదేశీ డ్రోన్లు



**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 28 :** ఒడిశాకు చెందిన బాన్‌వ్ ఏరో సంస్థ భారత సైన్యానికి 45 భారీ బరువులు మోసే మానవరహిత వైమానిక వాహనాలను అందించింది. ఈ డ్రోన్లను భారత సైన్యం తూర్పు కమాండ్‌కు అప్పగించినట్లు సంస్థ వెల్లడించింది. ఈశాన్య భారతదే శం లోని క్లిష్ట భౌగోళిక పరిస్థితుల్లో వ్యూహాత్మక రవాణా అవసరాల కోసం వీటిని వినియోగించనున్నారు. ఈ మానవరహిత వైమానిక వాహనాలు భారీ బరువులను మోసుకెళ్లే సామర్థ్యాన్ని కలిగి ఉన్నాయి. సైనిక సామగ్రి, అత్యవసర సరఫరాలు, ప్రత్యేక కార్యాచరణలకు అవసరమైన వస్తువులను వేగంగా చేరవేయడంలో ఇవి కీలక పాత్ర పోషించనున్నాయి. ముఖ్యంగా రహదారి సౌకర్యాలు పరిమితంగా ఉన్న కొండ ప్రాంతాల్లో ఈ డ్రోన్లు ఉపయోగకరంగా ఉండనున్నాయి. ఈశాన్య రాష్ట్రాల్లోని సరిహద్దు ప్రాంతాలు, అటవీ ప్రాంతాలు, ఎత్తైన పర్వత ప్రాంతాల్లో సైనిక కార్యకలాపాలకు అవసరమైన సరఫరాలను అందించేందుకు వీటిని వినియోగిస్తారు. ప్రతికూల వాతావరణ పరిస్థితుల్లో కూడా కార్యాచరణ సామర్థ్యాన్ని పెంచేందుకు ఈ సాంకేతికత దోహదపడుతుందని అధికారులు భావిస్తున్నారు. స్వదేశీ సాంకేతిక పరిజ్ఞానంతో అభివృద్ధి చేసిన ఈ డ్రోన్లు దేశ రక్షణ రంగంలో ఆత్మనిర్భర్ భారత్ లక్ష్యాలకు బలాన్ని చేకూరు స్తున్నాయి. విదేశీ సాంకేతికతపై ఆధారపడకుండా దేశీయ సంస్థలు అభివృద్ధి చేసిన ఆధునిక పరికరాలను సైన్యం వినియోగించడం ప్రాధాన్యత సంతరిం చుకుంది. భారత సైన్యం అవసరాలకు అనుగుణంగా రూపొందించిన ఈ డ్రోన్లు వేగవంతమైన రవాణా, తక్కువ సమయంలో సరఫరాల పంపిణీ, క్లిష్ట ప్రాంతాల్లో చేరుకునే సామర్థ్యాన్ని కలిగి ఉన్నాయి. భవిష్యత్తులో మరిన్ని ఆధునిక మానవరహిత వ్యవస్థలను వినియోగంలోకి తీసుకురావడానికి ఇది మార్గం సుగమం చేస్తుందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. రక్షణ రంగంలో స్వదేశీ తయారీ సామర్థ్యాన్ని పెంపొందిస్తూ భారతదేశం స్వావలంబన దిశగా అడుగులు వేస్తున్న నేపథ్యంలో ఈ పరిణామం మరో ముఖ్యమైన మైలురాయిగా నిలిచింది. తూర్పు కమాండ్ కార్యాచరణ సామర్థ్యాలను మరింత బలోపేతం చేయడంలో ఈ డ్రోన్లు కీలక పాత్ర పోషించనున్నాయి.

# దేశవ్యాప్త బంగారం అక్రమ రవాణా ముఠా గుట్టురట్టు




**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 28 :** రెవెన్యూ ఇంటెలిజెన్స్ డైరెక్టరేట్ అధికారులు దేశవ్యాప్తంగా కార్యకలాపాలు నిర్వహిస్తున్న భారీ బంగారం అక్రమ రవాణా ముఠాను ఛేదించారు. ఈ చర్యల్లో భాగంగా సుమారు 6.6 కిలోల విదేశీ మూలాల బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసిన బంగారం విలువ రూ.10 కోట్లకు పైగా ఉంటుందని అధికారులు వెల్లడించారు. ఈ కేసులో ముఠా సూత్రధారితో పాటు మొత్తం 11 మందిని అరెస్టు చేసినట్లు అధికారులు తెలిపారు. దేశంలోని పలు ప్రాంతాల్లో సమన్వయంతో నిర్వహించిన దాడుల ద్వారా అక్రమ రవాణా నెట్‌వర్క్ కార్యకలాపాలను వెలుగులోకి తీసుకొచ్చారు. అరెస్టు చేసిన వారి నుంచి కీలక సమాచారం సేకరిస్తున్నట్లు వెల్లడించారు.

ప్రాథమిక దర్యాప్తులో ఈ ముఠా కొరియర్ మార్గాలను వినియోగించి విదేశీ బంగారాన్ని దేశంలోకి అక్రమంగా తరలిస్తున్నట్లు గుర్తించారు. గత తొమ్మిది నెలల కాలంలో సుమారు 318 కిలోల అక్రమ బంగారాన్ని దేశంలోని వివిధ ప్రాంతాలకు తరలించినట్లు విచారణలో తేలింది. అక్రమంగా రవాణా చేసిన బంగారం విలువ సుమారు రూ.475 కోట్ల వరకు ఉంటుందని అధికారులు అంచనా వేశారు. బంగారం సరఫరా, పంపిణీ కోసం ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేసి దేశవ్యాప్తంగా కార్యకలాపాలు నిర్వహించినట్లు దర్యాప్తులో బయటపడింది. ఈ వ్యవహారంలో పాల్గొన్న ఇతర వ్యక్తులు, సంబంధిత నెట్‌వర్క్‌లపై కూడా విచారణ కొనసాగుతోందని అధికారులు తెలిపారు. ఆర్థిక నేరాలకు అడ్డుకట్ట వేయడానికి కేంద్ర సంస్థలు సమన్వయంతో పనిచేస్తున్నాయని పేర్కొన్నారు. దేశంలో బంగారం అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపేందుకు చర్యలు కొనసాగుతున్నాయని అధికారులు స్పష్టం చేశారు. ఈ కేసుకు సంబంధించిన మరిన్ని వివరాలను దర్యాప్తు పూర్తైన తర్వాత వెల్లడిస్తామని తెలిపారు.

# సముద్రంలో భారీ ప్రమాదాన్ని నివారించిన భారత తీరరక్షక దళం



**పరదీప్, సెప్టెంబర్ 28 :** ఒడిశా తీరంలోని పరదీప్ సమీప సముద్ర జలాల్లో సంభవించే భారీ ప్రమాదాన్ని భారత తీరరక్షక దళం సమయోచిత చర్యలతో నివారించింది. 9,000 మెట్రిక్ టన్నుల పామాయిల్‌తో పాటు 23 మంది సిబ్బందిని తీసుకెళ్తున్న ఎంటీ సీగల్-9 నౌక నుంచి అత్యవసర సహాయ సంకేతం అందడంతో తీరరక్షక దళం వెంటనే స్పందించింది. నౌక ఒకవైపుకు వంగి అస్థిర స్థితిలో ఉండటంతో ప్రమాదం సంభవించే అవకాశం ఉన్నట్లు గుర్తించారు. సహాయ సంకేతం అందుకున్న వెంటనే తీరరక్షక నౌక విశ్వస్త్ ప్రత్యేక రక్షణ చర్యలను ప్రారంభించింది. ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొం టూ నిపుణుల బృందం నౌకపైకి చేరుకుని పరిస్థితిని అంచనా వేసింది. నౌకలోకి చేరిన నీటిని బయటకు పంపేందుకు ప్రత్యేక పంపులను వినియోగించడంతో పాటు దెబ్బతిన్న సముద్ర పైపులను మూసివేసి మరింత ప్రమాదం జరగకుండా చర్యలు చేపట్టింది. నౌక ఒకవైపుకు వంగిపోవడానికి కారణమైన బ్యాలస్ట్ ట్యాంకుల్లోకి చేరిన నీటిని బయటకు పంపించడం ద్వారా నౌకను తిరిగి సమతుల్య స్థితికి తీసుకు వచ్చారు. ప్రమాదం మరింత తీవ్రమై సముద్ర కాలుష్యానికి దారితీయకుండా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకున్నారు. ఈ చర్యల వల్ల నౌకలో ఉన్న సిబ్బంది సురక్షి తంగా ఉండటంతో పాటు సరకు కూడా రక్షితమైంది. సముద్ర కాలుష్య నియంత్రణ కోసం తీరరక్షక దళానికి చెందిన కాలుష్య నియంత్రణ నౌక, సముద్ర గస్తీ నౌకలను కూడా ఘటనాస్థలికి మళ్లించారు. పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించేందుకు వైమానిక నిఘా కూడా ఏర్పాటు చేశారు. తీరరక్షక దళానికి చెందిన డోర్నియర్ విమానం నిర్వహించిన పరిశీలనలో సముద్ర ఉపరితలంపై కనిపించిన స్వల్ప పామాయిల్ ఆనవాళ్లు పూర్తిగా చెదరిపోయినట్లు నిర్ధారించింది. రక్షణ చర్యలు విజయవంతంగా పూర్తికావడంతో ఎంటీ సీగల్-9 నౌకను టగ్‌బోట్ సహాయంతో పరదీప్ నౌకాశ్రయం వైపు సురక్షితంగా తరలిస్తున్నారు. నౌక ప్రయాణాన్ని తీరరక్షక దళం నిరంతరం పర్యవేక్షిస్తూ అవసరమైన భద్రతా చర్యలు చేపడుతోంది. సముద్ర రవాణా భద్రతకు ఎలాంటి ముప్పు తలెత్తకుండా అధికారులు చర్యలు కొనసాగిస్తున్నారు. భారత తీరరక్షక దళం సముద్ర భద్రత, పర్యావరణ పరిరక్షణలో తన అప్రమత్తతను మరోసారి చాటుకుంది. సముద్రంలో సంభవించే అత్యవసర పరిస్థితులకు తక్షణమే స్పందిస్తూ ప్రాణాలు, ఆస్తులను కాపాడడంలో తీరరక్షక దళం కీలక పాత్ర పోషిస్తోందని అధికారులు తెలిపారు. దేశ సముద్ర సరిహద్దుల భద్రతతో పాటు సముద్ర పర్యావరణ పరిరక్షణకు కూడా దళం నిరంతరం కృషి చేస్తోందని పేర్కొన్నారు.

# జన్‌స్కార్‌లో భారీ స్వచ్ఛత కార్యక్రమం

**జన్‌స్కార్, సెప్టెంబర్ 28 :** భారత సైన్యానికి చెందిన "ఎప్పుడూ కార్యాచరణలోనే" విభాగం ఆధ్వర్యం లో జన్‌స్కార్‌లోని కచోథాం గ్ ప్రాంతంలో భారీ స్వచ్ఛత కార్యక్రమం నిర్వహించారు. సరిహ ద్దు రహదారు ల సంస్థ, పౌర పరిపాలన యంత్రాంగం, పోలీసు శాఖ, స్థానిక పాఠశాలల సహకా రంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. పరిశుభ్రమైన పరిసరాలు, పర్యావర ణ పరిరక్షణ, బాధ్యతాయుత వ్యర్థాల నిర్వహణపై ప్రజల్లో చైతన్యం కల్పించడమే కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యంగా నిర్వాహకులు తెలిపారు. ఈ స్వచ్ఛత కార్యక్రమంలో సుమారు 250 మంది సైనికులు, అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు. "పరిశుభ్రతలో భాగస్వామ్యం" అనే భావనతో అందరూ కలిసి ప్రాంతంలోని పలు ప్రదేశాలను శుభ్రపరిచారు. వ్యర్థాలను తొలగించడం, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం, ప్రజలకు ఆదర్శంగా నిలిచే విధంగా కార్యక్రమాన్ని నిర్వహించా రు. పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యత నిర్వర్తించాలని ఈ సందర్భంగా అధికారులు సూచించారు. పరిశుభ్రత అనేది కేవలం ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాదని, ప్రతి పౌరుడు ఇందులో భాగస్వామి కావాలని తెలిపారు. ప్రకృతి సంపదను కాపాడుకోవడం ద్వారా భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన వాతావరణాన్ని అందించవచ్చని పేర్కొన్నారు.





# భారత్-పోలాండ్ రక్షణ బంధం బలోపేతం

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 28 :** భారత్-పోలాండ్ మధ్య రక్షణ, రక్షణ ఉత్పత్తి రంగాల్లో సహకారాన్ని మరింత విస్తరించే దిశగా కీలక సమావేశం జరిగింది. భారత్-పోలాండ్ సంయుక్త కార్యబృందం సమావేశానికి పోలాండ్ ఉపమంత్రి మగ్దలెనా సోబ్‌కోవియాక్-చార్నెకా, భారత రక్షణ ఉత్పత్తి శాఖ కార్యదర్శి సంజీవ్ కుమార్ సంయుక్తంగా అధ్యక్షత వహించారు. ఈ సమావేశంలో 2024-2028 కాలానికి రూపొందించిన సంయుక్త కార్యాచరణ ప్రణాళిక అమలుపై సమగ్ర చర్చ జరిగింది. రెండు దేశాల మధ్య సంస్థాగత సంబంధాలను మరింత బలోపేతం చేయడంతో పాటు రక్షణ, రక్షణ ఉత్పత్తి రంగాల్లో భాగస్వామ్యాన్ని విస్తరించే అంశాలపై అభిప్రాయాలు పంచుకున్నారు. భారత్‌లో స్వదేశీ రక్షణ తయారీకి ప్రాధాన్యత ఇస్తున్న నేపథ్యంలో ఉమ్మడి ఉత్పత్తి, సాంకేతిక పరిజ్ఞాన మార్పిడి, పారిశ్రామిక భాగస్వామ్య అవకాశాలపై కూడా చర్చించినట్లు అధికారులు తెలిపారు. ఇరు దేశాల మధ్య వ్యూహాత్మక సహకారాన్ని మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లేందుకు సమావేశం దోహదపడిందని పేర్కొన్నారు. రక్షణ రంగంలో పరస్పర సహకారం, శిక్షణ, పరిశోధన, ఆధునిక సాంకేతిక పరిజ్ఞాన వినియోగం వంటి అంశాల్లో కూడా భాగస్వామ్యాన్ని పెంచుకోవాలని నిర్ణయించారు.

# కార్మిక సంస్కరణలపై కేంద్రం దృష్టి

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 28 :** పారిశ్రామిక సంబంధాలు, కార్మిక సంక్షేమం, ఉపాధి రంగ అభివృద్ధిపై కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు కేంద్ర కార్మిక, ఉపాధి శాఖ మంత్రి మన్సుఖ్ మాండవీయ తెలిపారు. జాతీయ పారిశ్రామిక సంబంధాలు, కార్మిక పురస్కారాల సదస్సు-2026లో పాల్గొన్న ఆయన కార్మిక రంగంలో జరుగుతున్న సంస్కరణలు, అవగాహన కార్యక్రమాలపై కీలక ప్రకటనలు చేశారు. దేశవ్యాప్తంగా కార్మిక నియమావళిపై అవగాహన పెంచేందుకు కేంద్ర కార్మిక శాఖ ఆధ్వర్యంలో "శ్రమ్ సంవాద్" పేరుతో ప్రత్యేక ప్రచార కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు మంత్రి వెల్లడించారు.



ఈ కార్యక్రమం ద్వారా కార్మికులు, యాజమాన్యాలు, పరిశ్రమల ప్రతినిధులకు నూతన నియమావళిపై సమగ్ర సమాచారం అందించనున్నట్లు తెలిపారు. దేశంలోని 316 జిల్లాల్లో ఉన్న పారిశ్రామిక సముదాయాలను కేవలం 90 రోజుల వ్యవధిలో కవర్ చేసే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని అమలు చేయనున్నట్లు మంత్రి పేర్కొన్నారు. కార్మిక హక్కులు, భద్రత, సంక్షేమ పథకాలు, ఉపాధి అవకాశాలు, సామాజిక భద్రత అంశాలపై విస్తృత అవగాహన కల్పించనున్నట్లు చెప్పారు. కార్మికులు, యాజమాన్యాల మధ్య సమన్వయం బలోపేతం కావడం ద్వారా పారిశ్రామిక శాంతి, ఉత్పాదకత పెరుగుతుందని మంత్రి అభిప్రాయపడ్డారు. కార్మిక నియమావళి అమలు వల్ల పారదర్శకత, బాధ్యతాయుత వ్యవస్థ ఏర్పడటంతో పాటు పరిశ్రమల అభివృద్ధికి కూడా దోహదపడుతుందని వివరించారు. సదస్సులో వివిధ రంగాలకు చెందిన నిపుణులు, పరిశ్రమల ప్రతినిధులు, కార్మిక సంఘాల నాయకులు పాల్గొని పారిశ్రామిక సంబంధాల మెరుగుదల, కార్మిక సంక్షేమం, నైపుణ్యాభివృద్ధి వంటి అంశాలపై చర్చించారు.



# పిల్లలకు వెండి పాత్రల్లో ఉగ్గు ఎందుకు తినిపిస్తారు?

**డెస్క్, సెప్టెంబర్ 28 :** చిన్న పిల్లలకు ఉగ్గు లేదా మొదటి ఆహారం వెండి గిన్నెలో తినిపించడం భారతీయ కుటుంబాల్లో చాలాకాలంగా కొనసాగుతున్న సంప్రదాయంగా కనిపిస్తుంది. ముఖ్యంగా తెలుగు కుటుంబాల్లో శిశువుకు అన్నప్రాశన వంటి కార్యక్రమాల సమయంలో వెండి పాత్రలను ఉపయోగించడం ఆనవాయితీగా ఉంది. వెండి శుభప్రదమైన లోహంగా భావించే సంప్రదాయం కారణంగా చాలా కుటుంబాలు పిల్లలకు వెండి గిన్నెలు, వెండి చెంచాలతో ఆహారం అందిస్తుంటాయి. ఇది ఆరోగ్యం, ఐశ్వర్యం, శుభం కలగాలని కోరుకునే కుటుంబ పెద్దల ఆకాంక్షకు ప్రతీకగా భావించబడుతుంది. పూర్వకాలంలో వెండి పాత్రలు పరిశుభ్రతకు అనుకూలమని ప్రజలు నమ్మేవారు. అందువల్ల చిన్నారుల ఆహారానికి ప్రత్యేకంగా వెండి పాత్రలను ఉపయోగించే అలవాటు ఏర్పడింది. కాలక్రమేణా ఇది ఒక కుటుంబ సంప్రదాయంగా మారింది.







# సమానత్వం కోసం పోరాడిన వ్యక్తి గుర్రం జాషువా

**మంత్రి కందుల దుర్గేష్**

**పద్మభూషణ్, కవిసామ్రాట్ గుర్రం జాషువా 131వ జయంతి వేడుకలు**

**విజయవాడ కలెక్టరేట్ లోని పింగళి వెంకయ్య కళా వేదికలో ఘనంగా నిర్వహణ**

**ముఖ్య అతిథిగా విచ్చేసి జాషువా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించిన రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖా మంత్రి కందుల దుర్గేష్**

విజయవాడ: సెప్టెంబర్ 28,2026.

విజయవాడ:భావకవిత్వం ఉప్పొంగుతున్న కాలంలోనే సామాజిక స్పృహను జోడించి, అణగారిన వర్గాల వేదనలను తన పద్యాలుగా మలచిన అరుదైన ప్రజాకవి గుర్రం జాషువా అని మంత్రి కందుల దుర్గేష్ వెల్లడించారు..రాష్ట్ర సృజనాత్మక, సంస్కృతి సంస్థ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ జిల్లా విజయవాడ కలెక్టరేట్ లోని పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో నవయుగ కవి చక్రవర్తి, పద్మభూషణ్ గుర్రం జాషువా 131వ జయంతి వేడుకలు అత్యంత ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖా మాత్యులు కందుల దుర్గేష్ ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా మహాకవి గుర్రం జాషువా చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు.

ఈ వేడుకల్లో భాగంగా తెలుగు సాహిత్య వికాసానికి, మనుగడకు, పరిరక్షణకు విశేష కృషి చేసిన ప్రముఖ సాహితీవేత్తలు షేక్ కరీముల్లా, డాక్టర్ జాలాది విజయకుమారి, విల్సన్ రావు కొమ్మవరపు, గడ్డం ఈశ్వరమ్మలకు 'కవిసామ్రాట్ గుర్రం జాషువా కవికోకిల సాహితీ పురస్కారం' కింద రూ. 50,000 నగదు ప్రోత్సాహకం, జ్ఞాపిక, ప్రశంసా పత్రాన్ని మంత్రి కందుల దుర్గేష్ అందజేసి సత్కరించారు.

ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ.."సామాజిక అసమానతలపై తన కలంతో పోరాడి, అణగారిన వర్గాల ఆత్మగౌరవానికి తన సాహిత్యం ద్వారా స్వరం అందించిన మహోన్నత వ్యక్తి గుర్రం జాషువా. నాటి కాలంలోనే మానవ హక్కులు, సమానత్వం కోసం ఆయన తన గబ్బిలం, ఫిరదౌసి తదితర కవితల ద్వారా సమాజాన్ని చైతన్యవంతం చేశారు. అంటరానితనాన్ని ఎదుర్కోవడానికి అక్షరాన్ని ఆయుధంగా మలచుకున్న ధీశాలి ఆయన.ఆధునిక తెలుగు కవులలో స్థానం పొందిన కవి కవికోకిల గుఱ్ఱం జాషువా కవిత్వాన్ని ఆయుధంగా చేసుకుని ఈ మూఢాచారాలపై తిరగబడ్డారు.. ఛీత్కారాలు ఎదురైన చోటే సత్కారాలు పొందారు. విశ్వ కవి సామ్రాట్ జాషువా బాటలోనే నడుస్తూ ఆయన ఆశయ సాధనకు, సమసమాజ నిర్మాణానికి మనమంతా కృషి చేయాలి. ఈ రోజు పురస్కారాలు అందుకున్న నలుగురు సాహితీమూర్తుల కృషి అనన్యసామాన్యం. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ల నేతృత్వంలో రాష్ట్ర ప్రభుత్వం కళలకు, కళాకారులకు, కవులకు పెద్దపీట వేస్తూ మన సాంస్కృతిక వైభవానికి పునర్జీవం పోస్తోంది. ఎందరో మహానుభావుల జయంతి వేడుకలను రాష్ట్ర పండుగలుగా నిర్వహిస్తూ వారి ఆశయాలను భవిష్యత్ తరాలకు అందిస్తున్నాము" అని పేర్కొన్నారు.

ఈ సందర్భంగా గుర్రం జాషువా రాసిన ఇచ్చోటనే సత్కవీంద్రుని కమ్మని కలము, నిప్పులలోన గరిగిపోయె..పద్యాన్ని మంత్రి దుర్గేష్ ఆలపించారు

నాటక రంగ అకాడమీ చైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ మాట్లాడుతూ.. సామాన్యులకు సైతం అర్థమయ్యే రీతిలో పద్యాలను రచించిన మహాకవి గుర్రం జాషువా అని కొనియాడారు. సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి కందుల దుర్గేష్ ల కృషితో రాష్ట్రంలో సాంస్కృతిక రంగానికి సువర్ణయుగం వచ్చిందన్నారు. ఇటీవలే బోయి భీమన్న అవార్డులు అందించామని, త్వరలోనే కందుకూరి పురస్కారాలతో పాటు నంది నాటకోత్సవాలు, నంది అవార్డులను కూడా ఘనంగా నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

సృజనాత్మక, సంస్కృతి సమితి చైర్ పర్సన్ తేజస్వి పొడపాటి మాట్లాడుతూ...జాషువా కవిత్వం ఎప్పుడూ ఆలోచింపజేస్తుందని, ప్రశ్నిస్తుందని, సమాజంలోని వివక్షను పారద్రోలేలా మార్పును కోరుతుందని తెలిపారు. ఎన్నో కష్టాలను అనుభవించి ఆ అనుభవాలనే కవిత్వంగా మలచి సమాజాన్ని తట్టిలేపిన గొప్ప కవి జాషువా అని, ఆయన ఆశయ సాధనకు అందరూ ఐక్యంగా కృషి చేయాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు రేగుళ్ల మల్లికార్జున రావు పలువురు ప్రముఖులు, సాహితీ ప్రియులు మరియు కళాకారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## బాల సంరక్షణ సంస్థల ప్రతినిధులకు న్యాయ అవగాహన కార్యక్రమం

**ముఖ్య అతిథిగా సీనియర్ సివిల్ జడ్జి మరియు DLSA కార్యదర్శి**

అమీర్ హుస్సేన్, క్రైమ్ బ్యూరో చీఫ్

హైదరాబాద్: జిల్లా బాలల సంరక్షణ విభాగం (ఐఅరీతీఅష్ జప్రఅశ్రీఽ్రాతీశేవష్అశీఅ ఖఅఈ) ఆధ్వర్యంలో, హైదరాబాద్ జిల్లాలోని అన్ని బాల సంరక్షణ సంస్థల ప్రతినిధుల కోసం సికింద్రాబాద్‌లో ఒక న్యాయ అవగాహన కార్యక్రమం నిర్వహించబడింది. జిల్లా న్యాయ సేవల అధికార సంస్థ (నాంపల్లి సెషన్స్ విభాగం, హైదరాబాద్) కార్యదర్శి శ్రీమతి ఎ. శ్రీదేవి ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా, శ్రీమతి ఎ. శ్రీదేవి 'జువనైల్ జస్టిస్ (పిల్లల సంరక్షణ మరియు రక్షణ) చట్టం', జువనైల్ జస్టిస్ బోర్డు (జీజీడీ) నిబంధనలు, పిల్లల హక్కులు మరియు బాల సంరక్షణకు సంబంధించిన చట్టపరమైన అంశాలపై అవగాహన కల్పించారు. బాల సంరక్షణ సంస్థలలో నివసిస్తున్న పిల్లల హక్కుల పట్ల, అలాగే ఉచిత న్యాయ సహాయం, విద్య, ఆరోగ్యం, రక్షణ మరియు పునరావాసం వంటి అంశాల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాల్సిన అవసరాన్ని ఆమె నొక్కి చెప్పారు. పిల్లలకు సంబంధించిన సమస్యలను సున్నితత్వంతో మరియు చట్టపరమైన నిబంధనలకు అనుగుణంగా పరిష్కరించాల్సిన ఆవశ్యకతను ఆమె వివరించారు. అంతేకాకుండా, జీజీడీ నిబంధనలు, బాల సంరక్షణ సంస్థల నిర్వహణ విధానాలు, పిల్లలపై హింస మరియు వేధింపుల నివారణ, అలాగే పిల్లల శ్రేయస్సును కాపాడటం వంటి అంశాలపై పాల్గొన్న వారికి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా బాలల సంరక్షణ అధికారి (DCPO) శ్రీ శ్రీనివాస్, కోఆర్డినేటర్ శ్రీ విజయ భాస్కర్, బాల సంరక్షణ సంస్థల ప్రతినిధులు, సంబంధిత అధికారులు మరియు ఇతర ప్రముఖులు పాల్గొన్నారు.

## సూర్యాపేట డీఈవోగా శ్రీనివాసరావు

సూర్యాపేట, సెప్టెంబర్ 28 :

సూర్యాపేట జిల్లా విద్యాశాఖ అధికారిగా (డీఈవో) చి. శ్రీనివాసరావును పూర్తి అదనపు బాధ్యతలపై (ఎఫ్ఏసీ) నియమిస్తూ రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం నిర్మల్ జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయంలో అసిస్టెంట్ డైరెక్టర్ హోదాలో ఫైనాన్స్ అండ్ అకౌంట్స్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న శ్రీనివాసరావుకు సూర్యాపేట డీఈవోగా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవో ఆర్‌టీ నంబర్ 175, పాఠశాల విద్య (సర్వీసెస్--1) శాఖ, తేదీ 28-09-2026 ఆధా రంగా పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ కార్యాలయం ఉత్తర్వులు విడుదల చేసింది. ఇప్పటివరకు సూర్యాపేట డీఈవోగా పూర్తి అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్న కె. అశోక్‌ను ఆ బాధ్యతల నుంచి రిలీవ్ చేశారు. ఆయన సమగ్ర శిక్ష రాష్ట్ర ప్రాజెక్టు డైరెక్టర్ కార్యాలయంలో అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేస్తున్నారు. శ్రీనివాసరావు వెంటనే సూర్యాపేట డీఈవోగా బాధ్యతలు స్వీకరించి, ఆ విషయాన్ని పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ కార్యాలయానికి నివేదించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

# రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం: ఎమ్మెల్యే సొంగ రోషన్ కుమార్

ఏలూరు, సెప్టెంబర్ 28: రైతుల సంక్షేమం, వ్యవసాయాభివృద్ధే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని చింతలపూడి నియోజకవర్గ శాసనసభ్యులు సొంగా రోషన్ కుమార్ పేర్కొన్నారు. చింతలపూడి మండలం ప్రగడవరం ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం (సొసైటీ) ఆధ్వర్యంలో నిర్వహించిన వార్షిక సర్వసభ్య (జనరల్ బాడీ) సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, సహకార సంఘాలు రైతులకు వెన్నెముక వంటివని, గ్రామాల్లోని ప్రతి రైతుకూ ప్రభుత్వ పథకాలు, రాయితీలు చేరేలా సొసైటీలు సమర్థవంతంగా పనిచేయాలని సూచించారు. రైతులకు అవసరమైన ఎరువులు, విత్తనాలు, వ్యవసాయ పనిముట్లను కొరత లేకుండా సకాలంలో అందుబాటులో ఉంచాలని అధికారులను, పాలకవర్గాన్ని ఆదేశించారు.

రైతులు తమ పంటలకు సంబంధించి ఎదుర్కొంటున్న పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా, వాటిని సంబంధిత అధికారులతో మాట్లాడి త్వరితగతిన పరిష్కరిస్తామని భరోసా ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ జిల్లా నాయకులు ముత్తా రెడ్డి , సొసైటీ అధ్యక్షులు తాళ్లూరి చిన్నా బాబు ,డైరెక్టర్లు, భేతి. నాగేష్, లక్క పాము.



వెంకటేశ్వరరావు, ఎక్స్ ఎంపీటీసీ. కనుమత రెడ్డి. రాజారెడ్డి, గ్రామ కార్యదర్శి. తాళం. చెన్నారావు, జనసేన గ్రామ అధ్యక్షులు. కొసన. చంద్రబాబు, చిలుకూరి. సుధీర్ రెడ్డి, చిలుకూరి. శ్రీనివాసరెడ్డి, సహకార శాఖ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు మరియు పెద్ద సంఖ్యలో గ్రామ రైతులు పాల్గొన్నారు.







# విద్యుత్తురంగంలో పలు సంస్కరణలు అమలు

**రాష్ట్ర ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్**

ఏలూరు/కైకలూరు, సెప్టెంబరు 28: కైకలూరు మండలం గోపవరం గ్రామంలో సోమవారం రూ 55 కోట్లతో 220/33 కెవి విద్యుత్తు ఉపకేంద్రంను రాష్ట్ర ఇందన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, ఏపి శాసనసభ ఉపసభాపతి కనుమూరి రఘురామకృష్ణశీరాజు, ఎమ్మెల్యే డా.కామినేని శ్రీనివాస్, శాసన మండలి సభ్యులు జయమంగళ వెంకటరమణ, జిల్లా జాయింటు కలెక్టరు డా.యం.జె.అభిషేక్ గౌడ కలసి లాంఛనంగా ప్రారంభించి, ప్రారంభోత్సవ శిలాఫలకాన్ని ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో రాష్ట్ర ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో వ్యవసాయ మరియు అనుబంధ పంటలతో పాటు ఆక్వా రంగం రైతులకు నాణ్యమైన విద్యుత్తును అందించేందుకు భారీ ఉపవిద్యుత్తు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. అక్వా రంగానికి విద్యుత్తును కేవలం ఒక రూ 1.50 కే సబ్సిడిపై కూటమి ప్రభుత్వం అందిస్తోందని, అన్ని వర్గాలు సంక్షేమమే కూటమి ప్రభుత్వం ప్రధమ లక్ష్యమని అన్నారు. ఏపి ఉపసభాపతి కనుమూరి రఘురామకృష్ణంరాజు మాట్లాడుతూ గత పాలకులు బాధ్యత లేని ప్రభుత్వం అని, కూటమి ప్రభుత్వం బాధ్యత గల ప్రభుత్వం అని ఇప్పటికే ప్రజలు అర్థం చేసుకున్నారని అన్నారు. కైకలూరు నియోజకవర్గంలో ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ అభివృద్ధి, సంక్షేమంలో దూసుకుపోతున్నారని అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు కుప్పం, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పిఠాపురం, ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ కైకలూరును అభివృద్ధి చేస్తున్నారని అన్నారు.

కైకలూరు ఎమ్మెల్యే డా.కామినేని శ్రీనివాస్ మాట్లాడుతూ రూ 55 కోట్లతో విద్యుత్తు ఉపకేంద్రం ప్రారంభోత్సవంతో 15 ఏళ్ల వరకు నియోజకవర్గంలో కరెంటు కష్టాలు ఉండవని అన్నారు. కేంద్రంలో పాటు ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ లు కొల్లేరు శాశ్వత పరిష్కారం కోసం ప్రత్యేక దృష్టిపెట్టారని అన్నారు. 22 (ఏ ) 2,800 ఎకరాలు భూములు రైతులకు అందించగలిగామని, ఇంకా మిగిలిన 900 ఎకరాలు కూడా క్లియరు చేసి రైతులకు అందిస్తామని అన్నారు. నా

శాసనమండలి సభ్యులు జయమంగళ వెంకటరమణ మాట్లాడుతూ ప్రతి ఎమ్మెల్యేకు ఒక ట్రెండు ఉంటుందని, కైకలూరు ఉత్తమ నియోజకవర్గంగా తీర్చిదిద్దేందుకు డా.కామినేని శ్రీనివాస్ శక్తివంచన లేకుండా కృషిచేస్తున్నారని అన్నారు. విమర్శనలకు తావులేకుండా, ఏ ఒక్కరిని విమర్శించకుండా అభివృద్ధి, సంక్షేమంలో ముందుకు దూసుకుపోతున్నారని అన్నారు. నియోజకవర్గంలో 1600 లు పైగా విద్యుత్తు ట్రాన్స్ ఫర్లు ఏర్పాటుచేసి, ఒక్క నిమిషం కరెంటు కోతలేకుండా, నిరంత రాయంగా క్వాలిటీ విద్యుత్తును అందించుటలో కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టిసారించిందని అన్నారు. ఈ కార్యక్రమంలో విద్యుత్తు శాఖ ఉన్నత అధికారులు, విద్యుత్తు శాఖ డైరెక్టర్లు, మాజీ శాసన మండలి సభ్యులు కమ్మిలి విఠల్ రావు, మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళీరామకృష్ణ, ఆర్డీవో కె.లక్ష్మీప్రసన్న, విద్యుత్తు శాఖ మరియు వివిధ శాఖలు అధికారులు, వివిధ గ్రామాలు ప్రజాప్రతినిధులు, వివిధ గ్రామాలు నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



# గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయా?

**డెస్క్, సెప్టెంబర్ 28 :**
ఆరోగ్యమే మహాభాగ్యం అని చెబుతారు. అయితే గ్రామీణ ప్రాంతాల్లో నివసిస్తున్న కోట్లాది మంది ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు ఇప్పటికీ పూర్తిస్థాయిలో అందుబాటులోకి రాలేదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. పట్టణాల్లో ఆధునిక వైద్య సదుపాయాలు వేగంగా విస్తరిస్తుండగా, అనేక గ్రామాల్లో ప్రాథమిక వైద్య సేవల కోసం కూడా ప్రజలు కిలోమీటర్ల దూరం ప్రయాణించాల్సిన పరిస్థితి కొనసాగుతోంది. ఆరోగ్య సేవలు ప్రతి పౌరుడి హక్కు అయినప్పటికీ గ్రామీణ ప్రాంతాల్లో ఈ హక్కు పూర్తిస్థాయిలో అమలవుతోందా అనే ప్రశ్న తలెత్తుతోంది. దేశ అభివృద్ధిలో గ్రామాలు కీలక పాత్ర పోషిస్తున్నప్పటికీ ఆరోగ్య రంగంలో మాత్రం ఇంకా అనేక సవాళ్లు కనిపిస్తున్నాయి. చాలా గ్రామాల్లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఉన్నప్పటికీ అవసరమైన వైద్యులు, సిబ్బంది, మందులు, పరికరాల కొరత తరచూ కనిపిస్తోంది. భవనాలు ఉన్నా సేవలు లేకపోవడం, సిబ్బంది ఉన్నా పరికరాలు లేకపోవడం వంటి సమస్యలు ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. ఫలితంగా చిన్న వ్యాధులకు కూడా ప్రజలు పట్టణాలపై ఆధారపడాల్సి వస్తోంది.

# ఆరోగ్యకర హృదయమే జీవితానికి బలం

**డెస్క్, సెప్టెంబర్ 28 :**
ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 29న ప్రపంచ హృదయ దినోత్సవాన్ని నిర్వహిస్తూ గుండె ఆరోగ్యం ప్రాధాన్యంపై ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా మరణాలకు ప్రధాన కారణాల్లో గుండె సంబంధిత వ్యాధులు ముందంజలో ఉండటంతో ఈ దినోత్సవానికి ప్రత్యేక ప్రాధాన్యం ఏర్పడింది. ఆధునిక జీవనశైలి, ఆహారపు అలవాట్లు, ఒత్తిడి, శారీరక శ్రమ తగ్గడం వంటి కారణాలతో గుండె జబ్బులు వేగంగా పెరుగుతున్నాయని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఈ నేపథ్యంలో గుండె ఆరోగ్యాన్ని కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యతగా మారింది. గుండె మన శరీరంలో అత్యంత కీలకమైన అవయవం. రక్తాన్ని శరీరమంతా పంపిస్తూ ప్రతి కణానికి ప్రాణవాయువు, పోషకాలను అందించే



బాధ్యతను నిర్వర్తిస్తుంది. గుండె పనితీరులో చిన్న లోపం వచ్చినా శరీర ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం పడుతుంది. గతంలో ఎక్కువగా వృద్ధుల్లో కనిపించే గుండె సమస్యలు ప్రస్తుతం మధ్య వయస్సు వారితో పాటు యువతలో కూడా పెరుగుతున్నాయి. ఇది సమాజం మొత్తం ఆందోళన చెందాల్సిన అంశంగా మారింది. నేటి జీవనశైలిలో వచ్చిన మార్పులు గుండె ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. గంటల తరబడి కూర్చునే ఉద్యోగాలు, వ్యాయామం లేకపోవడం, నిద్రలేమి, వేళకు భోజనం చేయకపోవడం, అధికంగా నూనె పదార్థాలు తీసుకోవడం వంటి అలవాట్లు గుండెకు ప్రమాదకరంగా మారుతున్నాయి. శరీరానికి అవసరమైన శారీరక కదలికలు తగ్గిపోవడంతో ఊబకాయం, రక్తపోటు, మధుమేహం వంటి సమస్యలు పెరిగి చివరకు గుండె జబ్బులకు దారితీస్తున్నాయి.



# మెంతులు.. చిన్న గింజల్లో ఆరోగ్య సంపద

**డెస్క్, సెప్టెంబర్ 28 :**
మెంతులు పరిమాణంలో చిన్నగా ఉన్నప్పటికీ తెలుగు వంటింటిలో ఎంతో ప్రాధాన్యం కలిగిన ఆహార పదార్థంగా గుర్తింపు పొందాయి. ప్రత్యేకమైన రుచి, సువాసన కారణంగా ఇవి అనేక రకాల వంటకాల తయారీలో ఉపయోగించబడుతున్నాయి. పప్పులు, పచ్చళ్లు, కూరలు, పొడులు వంటి అనేక వంటకాలో మెంతులకు ప్రత్యేక స్థానం ఉంది. పోషకాహార నిపుణుల ప్రకారం మెంతుల్లో పీచు పదార్థం, పలు ఖనిజాలు, మొక్కల ఆధారిత పోషకాలు లభిస్తాయి. అందువల్ల సమతుల్య ఆహారంలో భాగంగా మితంగా తీసుకోవాలని సూచిస్తున్నారు. సంప్రదాయ ఆహార అలవాట్లలో మెంతుల వినియోగం చాలాకాలంగా కొనసాగుతోంది. మెంతులను నానబెట్టి తీసుకోవడం, మొలకలు చేయడం, పొడి రూపంలో ఉపయోగించడం వంటి పద్ధతులు కూడా ఉన్నాయి. కొన్ని ప్రాంతాల్లో మెంతికూరతో పాటు మెంతి గింజలను కూడా వంటల్లో ఉపయోగిస్తారు. దీంతో ఆహారానికి ప్రత్యేక రుచి వస్తుంది. వ్యవసాయ రంగంలో కూడా మెంతులు ఒక ముఖ్యమైన పంటగా సాగు చేయబడుతున్నాయి. స్థానిక మార్కెట్ల నుంచి పెద్ద వ్యాపార కేంద్రాల వరకు వీటికి నిరంతర డిమాండ్ కనిపిస్తోంది. ఇంటి వంటల్లో నిల్వ ఉంచుకునే ముఖ్యమైన దినుసుల్లో మెంతులు ఒకటిగా ఉన్నాయి. ఆహార నిపుణులు ఒకే పదార్థంపై ఆధారపడకుండా పండ్లు, కూరగాయలు, ధాన్యాలు, పప్పులు, గింజలు వంటి విభిన్న ఆహారాలను తీసుకోవాలని సూచిస్తున్నారు. మెంతులను కూడా సమతుల్య ఆహారంలో భాగంగా చేర్చుకోవచ్చని చెబుతున్నారు. మొత్తంగా మెంతులు చిన్న గింజలైనా రుచి, సువాసన, పోషకాల కారణంగా తెలుగు వంటింటిలో ప్రత్యేక గుర్తింపు పొందాయి. సంప్రదాయ వంటకాల నుంచి ఆధునిక ఆహార అలవాట్ల వరకు తమ ప్రత్యేక స్థానాన్ని కొనసాగిస్తున్నాయి.

# పశ్చిమ సరిహద్దు భద్రతపై సమీక్ష నిర్వహించిన బీఎస్ఎఫ్ డైరెక్టర్ జనరల్

**గాంధీనగర్, సెప్టెంబర్ 28 :**
సరిహద్దు భద్రతా దళం డైరెక్టర్ జనరల్ ప్రవీణ్ కుమార్, ఐపీఎస్ పశ్చిమ సరిహద్దు భద్రత, కార్యాచరణ సన్నద్ధత, సరిహద్దు నిర్వహణ అంశాలపై ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. గుజరాత్‌లోని గాంధీనగర్ సరిహద్దు ప్రధాన కార్యాలయంలో జరిగిన ఈ సమావేశంలో పశ్చిమ సరిహద్దు ప్రాంతాల్లో భద్రతా పరిస్థితులు, భవిష్యత్ సవాళ్లపై విస్తృతంగా చర్చించారు. సమావేశంలో సరిహద్దు భద్రతా వ్యవస్థను మరింత పటిష్టం చేయడం, కేంద్ర హోం మంత్రిత్వ శాఖ తాజా ఆదేశాల అమలు, సరిహద్దు మౌలిక వసతుల అభివృద్ధి, చొరబాట్ల నిరోధక చర్యలు, అంతర్జాతీయ అక్రమ రవాణా నియంత్రణ వంటి అంశాలను సమీక్షించారు. భద్రతా సవాళ్లను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు ప్రత్యేక కార్యాచరణను రూపొందించాలని అధికారులకు సూచించారు. సరిహద్దు ప్రాంతాలపై పూర్తి ఆధిపత్యం సాధించేందుకు మానవ వనరులు, సాంకేతిక పరిజ్ఞానం, గూఢచార సమాచారాన్ని సమర్థంగా వినియోగించాలని డీజీ ప్రవీణ్ కుమార్ ఆదేశించారు. ఇతర భద్రతా సంస్థలు, ప్రభుత్వ శాఖలు, పౌర పరిపాలన యంత్రాంగంతో మరింత సమన్వయం పెంచాలని సూచించారు. సమిష్టి కృషితో సరిహద్దు భద్రతను మరింత బలోపేతం చేయాలని పేర్కొన్నారు. దేశాన్ని మాదక ద్రవ్యాల రహితంగా తీర్చిదిద్దాలన్న కేంద్ర ప్రభుత్వ లక్ష్యాన్ని ప్రస్తావించిన డీజీ, అంతర్జాతీయ మాదక ద్రవ్యాల అక్రమ రవాణా ముఠాలను పూర్తిగా నిర్వీర్యం చేసేందుకు నిరంతర చర్యలు కొనసాగించాలని అధికారులను ఆదేశించారు. సరిహద్దుల ద్వారా జరిగే మాదక ద్రవ్యాల రవాణాను అడ్డుకునేందుకు మరింత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అనంతరం ప్రవీణ్ కుమార్ గుజరాత్‌లోని ఓఖాలో ఉన్న జాతీయ తీర ప్రాంత పోలీసింగ్ అకాడమీని సందర్శించారు. అక్కడ శిక్షణ కార్యక్రమాల పురోగతి, రాబోయే మౌలిక వసతుల ప్రాజెక్టులు, శిక్షకులు మరియు సిబ్బంది లభ్యతపై సమీక్ష నిర్వహించారు. శిక్షణ నాణ్యతను మరింత మెరుగుపరిచే దిశగా అవసరమైన సూచనలు చేశారు. అకాడమీ ప్రాంగణంలో నిర్వహించిన మొక్కల నాటే కార్యక్రమంలో డీజీ పాల్గొన్నారు. అనంతరం అక్కడి జవాన్లు, సిబ్బందితో కలిసి భోజనం చేసి వారి సంక్షేమం, విధుల నిర్వహణకు సంబంధించిన అంశాలను తెలుసుకున్నారు. దేశ సరిహద్దుల భద్రత, తీర ప్రాంత





రక్షణలో బీఎస్ఎఫ్ కీలక పాత్ర పోషిస్తోందని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు.

# తాయ్‌మామన్ పథకానికి విజయ్ శ్రీకారం

**మదురై, సెప్టెంబర్ 28 :**
తమిళనాడులో నవజాత శిశువుల సంక్షేమం, కుటుంబ విలువలకు ప్రాధాన్యం కల్పించే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం "తాయ్‌మామన్ బంగారు ఉంగరం పథకం"ను ప్రారంభించింది. మదురై ప్రభుత్వ రాజాజీ ఆసుపత్రిలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ముఖ్యమంత్రి జోసెఫ్ విజయ్ పాల్గొని పథకాన్ని ప్రారంభించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో జన్మించిన శిశువులకు బంగారు ఉంగరాలు తొడిగుతూ ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో జన్మించిన పలువురు శిశువులను ముఖ్యమంత్రి స్వయంగా ఆశీర్వదించి బంగారు ఉంగరాలు తొడిగారు. శిశువు జననం ప్రతి కుటుంబానికి ఆనందోత్సవమని, ఆ ఆనందంలో ప్రభుత్వం కూడా భాగస్వామి కావాలనే ఉద్దేశంతో ఈ పథకాన్ని తీసుకొచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో శిశువుల తల్లిదండ్రులు, వైద్యులు, ఆరోగ్య శాఖ అధికారులు పాల్గొన్నారు. తమిళ సంస్కృతిలో తాయ్‌మామన్‌కు ప్రత్యేక స్థానం ఉందని ప్రభుత్వం పేర్కొంది. ప్రేమ, ఆప్యాయత, బాధ్యతలకు ప్రతీకగా భావించే ఈ సంప్రదాయాన్ని ప్రతిబింబించే విధంగా పథకాన్ని రూపొందించినట్లు వివరించింది. కుటుంబ బంధాలను మరింత బలోపేతం చేయడంతో పాటు సంప్రదాయ విలువలను భావితరాలకు చేరవేయడం కూడా ఈ కార్యక్రమం లక్ష్యమని వెల్లడించింది. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాలను ప్రోత్సహించేందుకు ఈ పథకం దోహదపడుతుందని అధికారులు అభిప్రాయపడ్డారు. తల్లులు, శిశువులకు నాణ్యమైన వైద్య సేవలు అందించడంతో పాటు వారి సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. ప్రజారోగ్య రంగంలో చేపడుతున్న సంస్కరణలకు ఇది మరో ముందడుగుగా పేర్కొన్నారు. కార్యక్రమానికి హాజరైన తల్లిదండ్రులు ప్రభుత్వ నిర్ణయాన్ని స్వాగతించారు. నవజాత శిశువుల జననాన్ని ప్రత్యేక సందర్భంగా గుర్తించి ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహం ఆనందాన్ని కలిగించిందని తెలిపారు. ఆసుపత్రి వాతావరణం పండుగను తలపించేలా మారిందని పేర్కొన్నారు. నవజాత శిశువుల పట్ల ప్రేమ, కుటుంబ బంధాల ప్రాధాన్యత, తమిళ సంస్కృతి గొప్పతనాన్ని ప్రతిబింబించే ఈ పథకం రాష్ట్రవ్యాప్తంగా అమలు కానుంది. ప్రభుత్వ ఆసుపత్రుల్లో జన్మించే ప్రతి శిశువుకు ఈ పథకం ద్వారా ప్రయోజనం కల్పించనున్నట్లు అధికారులు తెలిపారు. ప్రజల నుంచి కూడా ఈ కార్యక్రమానికి మంచి స్పందన లభిస్తున్నట్లు పేర్కొన్నారు.




# అండమాన్ కమాండ్‌ను సందర్శించిన ప్రతినిధులు

**పోర్ట్ బ్లెయిర్, సెప్టెంబర్ 28 :**
జాతీయ రక్షణ కళాశాల 66వ కోర్సుకు చెందిన 15 మంది సభ్యుల ప్రతినిధి బృందం అండమాన్ నికోబార్ కమాండ్‌ను సందర్శించింది. మేజర్ జనరల్ పవన్ పాల్ సింగ్ నేతృత్వంలోని ఈ బృందం ముందస్తు ప్రాంతాల పర్యటనలో భాగంగా అండమాన్ నికోబార్ దీవులకు చేరుకుంది. ఈ పర్యటన ద్వారా భారతదేశంలోని ఏకైక త్రివిధ దళాల కమాండ్ కార్యకలాపాలపై అవగాహన పొందింది. ప్రతినిధి బృందంలో నేపాల్, ఈజిప్ట్, మాల్దీవులు, మయన్మార్, నైజీరియా దేశాలకు చెందిన ఐదుగురు సైనిక అధికారులు కూడా పాల్గొన్నారు. ఈ పర్యటన ద్వారా అంతర్జాతీయ సైనిక సహకారం, పరస్పర అనుభవాల మార్పిడి, వృత్తిపరమైన సంబంధాల బలోపేతానికి అవకాశం లభించినట్లు అధికారులు తెలిపారు. అండమాన్ నికోబార్ కమాండ్ అధికారులు బృందానికి కమాండ్ కార్యాచరణ, నిర్వహణ వ్యవస్థ, రవాణా, సరఫరా ఏర్పాట్లు, సముద్ర భద్రతా సవాళ్లు తదితర అంశాలపై సమగ్ర వివరణ ఇచ్చారు. ద్వీప ప్రాంతాల ప్రత్యేక భౌగోళిక పరిస్థితులు, సముద్ర మార్గాల భద్రత, వ్యూహాత్మక ప్రాధాన్యత వంటి అంశాలను వివరించారు. భారతదేశపు తొలి త్రివిధ దళాల కమాండ్‌గా



అండమాన్ నికోబార్ కమాం డ్ నిర్వహిస్తున్న కీలక బాధ్యతలపై ప్రతినిధి బృందానికి అవగాహన కల్పించారు. భూ, జల, వాయు దళాల సమన్వయంతో నిర్వహించే కార్యాచరణలు, సమగ్ర రక్షణ వ్యవస్థలపై అధికారులు వివరించారు. ద్వీప ప్రాంతాల్లో ఎదురయ్యే సవాళ్లను అధిగమించేందుకు అనుసరిస్తున్న వ్యూహాలను కూడా తెలియజేశారు. ఇండో-పసిఫిక్ ప్రాంతంలో సముద్ర భద్రత ప్రాధాన్యత రోజురోజుకు పెరుగుతున్న నేపథ్యంలో ఈ పర్యటన ప్రత్యేక ప్రాముఖ్యత సంతరించుకుంది. భవిష్యత్ సైనిక నాయకులకు సమగ్ర కార్యాచరణ అవగాహన కల్పించడంలో ఇలాంటి పర్యటనలు కీలకంగా మారుతున్నాయని అధికారులు పేర్కొన్నారు. త్రివిధ దళాల సమన్వయం, ఏకీకృత కార్యాచరణ సామర్థ్యాల పెంపు, భవిష్యత్ నాయకత్వ నైపుణ్యాల అభివృద్ధికి అండమాన్ నికోబార్ కమాండ్ కట్టుబడి ఉందని అధికారులు తెలిపారు. సముద్ర భద్రత, సంయుక్త సైనిక కార్యాచరణలపై మరింత అవగాహన పెంపొందించడమే ఈ పర్యటన ప్రధాన ఉద్దేశమని వెల్లడించారు.

# మహిళా శక్తికి కొత్త వేదిక

**ములుగు, సెప్టెంబర్ 28 :**
మహిళా సంఘాల సభ్యులు కేవలం పొదుపు కార్యకలాపాలకే పరిమితం కాకుండా స్వయం ఉపాధి, వ్యాపార రంగాల్లోనూ ముందుకు వచ్చి ఆర్థికంగా బలపడాలని రాష్ట్ర మంత్రి సీతక్క అన్నారు. ములుగు సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో మెప్మా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్, టీ కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావుతో కలిసి ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మహిళల అభివృద్ధి కోసం ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాల గురించి వివరించారు. క్యాంటీన్ ప్రారంభం అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన వంటశాల, భోజనశాల, తాగునీటి సౌకర్యాలు, ఇతర వసతులను మంత్రి పరిశీలించారు. ప్రజలకు పరిశుభ్రమైన ఆహారం అందించడంతో పాటు మహిళా సంఘాలకు స్థిరమైన ఆదాయం సమకూర్చేలా ఈ కేంద్రాన్ని నిర్వహించాలని సూచించారు. ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చే ప్రజలకు మెరుగైన సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. మహిళలు ఆర్థికంగా బలపడితే కుటుంబం, సమాజం రెండూ అభివృద్ధి చెందుతాయని మంత్రి పేర్కొన్నారు. స్వయం సహాయక సంఘాల ద్వారా వేలాది మంది మహిళలు ఇప్పటికే వివిధ రంగాల్లో విజయవంతంగా ముందుకు సాగుతున్నారని గుర్తు చేశారు. ఇప్పుడు వ్యాపార రంగంలో మరింత అవకాశాలు కల్పిస్తూ మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమాలు అమలు చేస్తోందన్నారు. ఇందిరా మహిళా శక్తి కార్యక్రమం ద్వారా మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పించడమే కాకుండా వారిలో నాయకత్వ లక్షణాలు పెంపొందించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. చిన్న స్థాయిలో ప్రారంభమైన వ్యాపారాలు భవిష్యత్తులో పెద్ద సంస్థలుగా ఎదిగే అవకాశం ఉందని చెప్పారు. మహిళలు ధైర్యంగా ముందడుగు వేస్తే ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. జిల్లా కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు మాట్లాడుతూ మహిళల ఆదాయ వనరులను పెంచేందుకు జిల్లా యంత్రాంగం ప్రత్యేక కార్యాచరణ చేపడుతోందన్నారు. మహిళా సంఘాల ద్వారా నిర్వహించే కార్యక్రమాలకు అవసరమైన శిక్షణ, ఆర్థిక సహాయం, మార్కెటింగ్ అవకాశాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. క్యాంటీన్ నిర్వహణలో నాణ్యత, పరిశుభ్రతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. మహిళల ఆర్థిక స్వావలంబనను పెంపొందించడం ద్వారా గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో సమగ్ర అభివృద్ధి సాధించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు పేర్కొన్నారు. మహిళా సంఘాల సభ్యులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఆదర్శవంతమైన వ్యాపార నమూనాలను రూపొందించాలని కోరారు. కార్యక్రమంలో ప్రజాప్రతి నిధులు, అధికారులు, మహిళా సంఘాల సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.





# 20 ఏళ్లకే వరుస సినిమాలు..

టాలీవుడ్‌లో కొత్త హీరోయిన్ల ఎంట్రీ ఎప్పటికప్పుడు పెరుగుతోంది. కొందరు అందంతో ఆకట్టుకుంటే.. మరికొందరు నటనకు ప్రాధాన్యం ఉన్న పాత్రలను ఎంచుకుంటూ గుర్తింపు తెచ్చు కుంటున్నారు. ముఖ్యంగా చాలా చిన్న వయసులోనే కథానాయికలుగా పరిచయమవుతున్న నటీమణుల సంఖ్య పెరుగుతోంది. కృతి శెట్టి, శ్రీలీల వంటి యంగ్ హీరోయిన్ల తర్వాత ఇప్పుడు మరో నటి వరుస సినిమాలతో ప్రేక్షకుల దృష్టిని ఆకర్షిస్తోంది. ఆమెనే అననతిక సునీల్ కుమార్. అననతిక సునీల్ కుమార్ 'మ్యాడ్' సినిమాతో తెలుగు తెరకు కథానాయికగా పరిచయమైంది. తొలి చిత్రంలోనే తన నటన, సహజమైన స్క్రీన్ ప్రెజెన్స్‌తో ఆకట్టుకుంది. పెద్దగా సినీ అనుభవం లేకపోయినా తెరపై ఎంతో సహజంగా కనిపిస్తూ ప్రేక్షకుల ప్రశంసలు అందుకుంది. 'మ్యాడ్' తర్వాత అననతికకు వరుస అవకాశాలు వచ్చాయి. తమిళంలో సూపర్‌స్టార్ రజినీకాంత్ నటించిన 'లాల్ సలామ్'లోనూ కనిపించింది. ఇటీవల 'రోమాంచకం' సినిమాలో నటించగా.. 'పరిమళ్ అండ్ కో'తోనూ ప్రేక్షకులను పలక రించింది.



# ఓటీటీలోకి వచ్చినా 'ఇరుముడి' జోరు తగ్గలేదే!

సినిమా ఓటీటీలోకి వచ్చిందంటే సాధారణంగా థియేటర్లలో ప్రేక్షకుల సంఖ్య తగ్గిపోతుంది. కానీ మాస్ మహారాజా రవితేజ నటించిన 'ఇరుముడి' మాత్రం ఈ ట్రెండ్‌కు భిన్నంగా ముందుకు సాగుతున్నట్లు తెలుస్తోంది. థియేటర్లలో విడుదలై 38 రోజులు పూర్తయినప్పటికీ.. నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమింగ్ ప్రారంభమై పది రోజులు దాటినా రెండు తెలుగు రాష్ట్రాల్లోని కొన్ని థియేటర్లలో ప్రేక్షకుల స్పందన కొనసాగుతున్నట్లు చిత్రబృందం, వాణిజ్య వర్గాలు చెబుతున్నాయి. హిందూపురంలోని ఎస్వీ సినిమాక్స్‌లో 'ఇరుముడి'కు వచ్చిన స్పందన ఇందుకు ఉదాహరణగా నిలిచింది. సినిమా విడుదలై 38 రోజులు పూర్తయిన తర్వాత కూడా ఆదివారం తొలి ఆటకు కుటుంబ ప్రేక్షకులు పెద్ద సంఖ్యలో తరలివచ్చినట్లు సమాచారం. ఓటీటీలో అందుబాటులో ఉన్నప్పటికీ థియేటర్‌కు వచ్చి సినిమా చూసేందుకు ప్రేక్షకులు ఆసక్తి చూపడంతో ఆ షోకు హౌస్‌ఫుల్ బోర్డు పడినట్లు తెలుస్తోంది.

# త్వరలో చిరంజీవి కొత్త ప్రయోగం?



మెగాస్టార్ చిరంజీవి అభిమానులకు ఆసక్తికరమైన వార్త వినిపిస్తోంది. దశాబ్దాలుగా తెలుగు సినీ పరిశ్రమలో తనదైన ముద్ర వేసిన ఆయన.. ఇప్పుడు డిజిటల్ వేదికపై సరికొత్త ప్రయోగానికి సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. ప్రముఖ ఓటీటీ వేదిక నెట్‌ఫ్లిక్స్ కోసం చిరంజీవి ఓ ప్రత్యేక కార్యక్రమం చేయనున్నారనే వార్తలు ప్రస్తుతం చర్చనీయాంశంగా మారాయి. చిరంజీవి ప్రధానంగా సినిమాల్లోనే కనిపిస్తుంటారు. అయితే ఈసారి సినిమాకు భిన్నంగా ఆయన ఓ పాడ్‌కాస్ట్‌కు వ్యాఖ్యాతగా వ్యవహ రించనున్నట్లు సమాచారం. తొలుత చిరంజీవితో ఓ డాక్యుమెంటరీ రూపొందించాలనే ఆలోచన తో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు కథనాలు చెబుతున్నాయి.



# రకుల్ ప్రీత్‌సింగ్‌కు షాక్..

బాలీవుడ్ నటి రకుల్ ప్రీత్ సింగ్, ఆమె మామ, సినీ నిర్మాత వాసు భగ్నానీ, పనోరమా స్టూడియోస్‌కు సంబంధించిన పలు ప్రదేశాల్లో ఆదాయపు పన్ను శాఖ సోదాలు నిర్వహిస్తోంది. ముంబైలో మొత్తం 12 ప్రాంతాల్లో ఈ తనిఖీలు జరుగుతున్నట్లు పలు వార్తా సంస్థలు వెల్లడించాయి. సినిమాల నిర్మాణం, ఫైనాన్సింగ్‌కు సంబంధించిన నిధుల లావాదేవీలపై అనుమానాల నేపథ్యంలో ఈ చర్యలు చేపట్టినట్లు సమాచారం. సినిమా ప్రాజెక్టులకు ఫైనాన్సింగ్ పేరుతో నిధులను విదేశాలకు తరలించినట్లు వచ్చిన ఆరోపణలపై అధికారులు దృష్టి సారించినట్లు తెలుస్తోంది. ముంబై ఆదాయపు పన్ను శాఖకు చెందిన బృందాలు పలు ప్రాంతాల్లో పత్రాలు, ఆర్థిక రికార్డులు, విదేశీ లావాదేవీల వివరాలను పరిశీలిస్తున్నాయి. అయితే ఇప్పటివరకు సోదాల్లో ఎలాంటి అక్రమాలు బయటపడ్డాయనే విషయంపై అధికారిక ప్రకటన వెలువడలేదు.



# కోలీవుడ్‌లో బిజీ.. బిజీ

యంగ్ హీరోయిన్ కయాదు లోహర్ ప్రస్తుతం వరుస అవకాశాలతో బిజీగా మారారు. గ్లామర్‌తో పాటు నటనకు ప్రాధాన్యం ఉన్న పాత్రలను ఎంచుకుంటూ తనకంటూ గుర్తింపు తెచ్చుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. 2026లోనే ఆమె నటించిన 'ఫంకీ', 'హృదయం మురళి', 'పల్లీ చట్టాంబి', 'ఐమ్ గేమ్', 'ఇమ్మోర్టల్', 'ది ప్యారడైజ్' చిత్రాలు ప్రేక్షకుల ముందుకు వచ్చాయి. ఒకే ఏడాదిలో ఆరు సినిమాలు విడుదల కావడం ఆమె కెరీర్‌లో ఉన్న వేగాన్ని తెలియజేస్తోంది. ఫలితాలతో సంబంధం లేకుండా అవకాశాలు ఇప్పటివరకు కయాదు నటించిన కొన్ని చిత్రాలు ఆశించిన స్థాయిలో వాణిజ్య విజయాన్ని అందుకోకపోయినా.. ఆమెకు వస్తున్న అవకాశాలపై మాత్రం పెద్దగా ప్రభావం కనిపించడం లేదు. గ్లామర్ పాత్రలకే పరిమితం కాకుండా విభిన్నమైన పాత్రలను ఎంచుకుంటూ దర్శకులు, నిర్మాతల దృష్టిని ఆకర్షిస్తున్నారు. కథకు ప్రాధాన్యం ఉన్న పాత్రల్లోనూ తనను తాను నిరూపించుకునే ప్రయత్నం చేస్తున్నారు. కోలీవుడ్ స్టార్ హీరోలతో ఛాన్సులు ం కయాదు లోహర్ తమిళ చిత్రసీమలో వరుస ప్రాజెక్టులతో బిజీగా ఉ న్నారు.

# రాజమౌళి-సూర్య కాంబో



**దర్శకధీరుడు** ఎస్.ఎస్. రాజమౌళి, తమిళ స్టార్ హీరో సూర్య కాంబినేషన్‌పై చాలా కాలంగా ఆసక్తి నెలకొంది. వీరిద్దరూ కలిసి సినిమా చేయబోతున్నారంటూ ఎప్పటికప్పుడు వార్తలు వస్తున్నా.. ఇప్పటివరకు అధికారిక ప్రకటన మాత్రం రాలేదు. తాజాగా చెన్నైలో జరిగిన 'డోంట్ ట్రబుల్ ది ట్రబుల్' కార్యక్రమంలో రాజమౌళికి ఇదే అంశంపై ప్రశ్న ఎదురైంది. ప్రశ్నకు రాజమౌళి సరదా సమాధానంకార్యక్రమంలో యాంకర్ సూర్యతో సినిమా చేసే అంశంపై ప్రశ్నించగా.. ఈ ప్రశ్న తనకు వస్తుందని ముందే ఊహించానని రాజమౌళి సరదాగా చెప్పారు. అయితే ప్రాజెక్టుకు సంబంధించిన ఎలాంటి వివరాలను వెల్లడించలేదు. తాను ఇప్పుడు ఏదైనా పెద్ద విషయాన్ని బయటపెడితే.. అసలు కార్యక్రమం కంటే ఆ విషయమే ప్రధాన చర్చగా మారిపోతుందని అన్నారు. 'స్పెషల్‌గా ఉ ంటుంది' అంటూ క్లూ అయితే రాజమౌళి అభిమానుల ఆసక్తిని మరింత పెంచేలా ఓ చిన్న క్లూ ఇచ్చారు. భవిష్యత్తులో తాను, సూర్య కలిసి సినిమా చేస్తే మాత్రం అది ప్రత్యేకంగా ఉంటుందని వ్యాఖ్యానించారు. ఆ సమయంలో ముందు వరుసలో కూర్చున్న సూర్య నవ్వుతూ స్పందించడం అభిమానులను ఆకట్టుకుంది. మళ్లీ ఊపందుకున్న చర్చరాజమౌళి–సూర్య కాంబినేషన్‌పై గతంలోనూ ఎన్నో ఊహాగానాలు వచ్చాయి. అయితే వాటిపై ఇప్పటివరకు అధికారిక స్పష్టత లేదు. తాజాగా రాజమౌళి చేసిన వ్యాఖ్యలతో ఈ కాంబినేషన్‌పై చర్చ మరోసారి ఊపందుకుంది. ప్రస్తుతం రాజమౌళి తన తదుపరి భారీ ప్రాజెక్ట్‌పై దృష్టి సారించగా.. సూర్య కూడా వరుస సినిమాలతో బిజీగా ఉన్నారు. వీరిద్దరి కలయిక ఎప్పుడు సాధ్యమవుతుందనే దానిపై మాత్రం ఇంకా అధికారిక సమాచారం వెలువడలేదు.

Apublished by **KALIDINDI SUMALATHA**, 1-7-750/1-3, F 103, SRUTHI SADAN APTS ST PIOUS SCHOOL ROAD, RAMNAGAR, HYDERABAD, TELANGANA - 500020. on behalf of RS USAR PUBLICATIONS, 1ST FLOOR, H.NO. 59-5-7, PALLAVI APARTMENTS, ITI COLLEGE ROAD, OPP MRF SHOW ROOM, VIJAYAWADA, N T R, ANDHRA PRADESH - 520008 edited by **RAGHURAMA RAJU KALIDINDI** and printed by **KALIDINDI SUMALATHA** at KING DIGITAL OFFSET PRINTERS, 24 11/2-14, LANKAVARI VEEDHI, BHAVAJIPETA 4TH LINE, MAHALAKSHMIGUDI NEAR, VIJAYAWADA, KRISHNA, ANDHRA PRADESH - 520003. PRGI NO: APTEL/26/A7657, Email: rsusarp@myyahoo.com, 9849350555, 9515121467